




www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం / తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

MONDAY 27TH JULY 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 131 COST : 3\- KHAMMAM, TELANGANA

సోమవారం 27 జూలై 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక :131 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


## ఇక ప్రధాని క్షమాపణకు పట్టు!

- విద్యార్థులపై పోలీసుల దాడి
- వ్యవహారంలో పార్లమెంటులో నిలదీసేందుకు విపక్షాలు సన్నద్ధం
- నేడు ఖర్గే చాంబర్లో కూటమి భేటీ నేడే లోక్‌సభలో పరీక్షల బిల్లు

న్యూఢిల్లీ, జూలై 26 కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా ప్రతిపక్షాల్లో కదనోత్సాహాన్ని పెంచింది. జంతర్‌మంతర్‌లో విద్యార్థులపై పోలీసుల దాడులకు ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పేలా పార్లమెంటు వేదికగా ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచాలని భావిస్తున్నాయి. మరోవైపు, ప్రశ్నపత్రాల లీకేజీకి

➢ మిగతా 2వ పేజిలో..



## ఇందిరమ్మ ఇళ్లకు టెండర్లు

- 7,340 ఎల్‌ఐజీ ఫ్లాట్ల నిర్మాణానికి ఆహ్వానం
- 10 ప్యాకేజీలు.. 16 టవర్లు.. 10 అంతస్తులతో నిర్మాణం
- అధికంగా ప్యాకేజీ-2లో 129 కోట్లతో 1440 ఫ్లాట్లకు..
- 29 నుంచి.. ఆగస్టు 19 వరకు టెండర్ల స్వీకరణ
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తొలిసారి ఈపీసీ విధానం

హైదరాబాద్, జూలై 26 పట్టణ గృహనిర్మాణ పథకం కింద కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఇళ్ల (ఫ్లాట్ల) కేటాయింపు తరువాతే నిర్మాణాలు చేపట్టాలని ఇప్పటికే నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యేలోపు టవర్ల నిర్మాణానికి సంబంధించిన టెండర్ల వ్యవహారాన్ని కూడా పూర్తిచేసేందుకు హౌసింగ్ బోర్డు చర్యలు చేపట్టింది. హైదరాబాద్ మహానగరం పరిధిలోని 24

➢ మిగతా 2వ పేజిలో..

# మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌తో కలిపే.. యువతరం బిల్లు



- చట్టసభలకు పోటీ వయసు 21 ఏళ్లకు తగ్గించే అంశాన్నీ చేర్చండి
- ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదన
- 21 ఏళ్ల యువత ఐఏఎస్, ఐపీఎస్ అవుతున్నారు, పెద్ద కంపెనీలనూ నడుపుతున్నారు..
- దేశ భవితనూ నిర్ణయించాలనుకుంటున్నారు
- చట్టసభలకు పోటీ వయసును 21 ఏళ్లకు
- తగ్గించే అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేస్తాం
- కేవలం నినాదాలతో దేశం అభివృద్ధి చెందదు
- ప్రతిపక్షాలు, ప్రజల మాటను వినాలి
- అలా చేయకనే 56 అంగుళాల ఛాతీ
- యువత ముందు తలవంచాల్సి వచ్చింది
- జాతీయ మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్

హైదరాబాద్, జూలై 26 దేశంలో అసెంబ్లీలు, లోక్‌సభకు పోటీచేసే కనీస వయసును 21 ఏళ్లకు తగ్గించాలని.. ప్రస్తుత మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులోనే ఈ అంశాన్నీ చేర్చాలని ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. ఇప్పుడు 21 ఏళ్ల యువత ఐఏఎస్, ఐపీఎ?సలు అవుతున్నారని, పెద్ద కంపెనీలనూ నడుపుతున్నారని గుర్తు చేశారు. వారికి రాజకీయాల్లో ఎందుకు అవకాశం ఇవ్వకూడదని ప్రశ్నించారు. ఈ అంశంపై రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని తెలిపారు. మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పెంపు, పునర్విభజన, పోటీ వయసు 21 ఏళ్లకు తగ్గించడం.. ఈ నాలుగు అంశాలనూ ఒకే బిల్లులో చేర్చి పార్లమెంటులో సమగ్ర చర్చ చేపట్టాలని ప్రధాని మోదీని కోరారు. లేదా సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేసి, ఈ అంశాలపై అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలని.. నిపుణులు, సంబంధిత వర్గాలతోనూ చర్చించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జాతీయ మీడియాతో మాట్లాడారు. దేశంలోని యువశక్తి ముందు 56 అంగుళాల ఛాతీ కూడా తలవంచాల్సి వచ్చిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఐదేళ్ల క్రితం రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన మూడు నల్లచట్టాలను ప్రతిపక్షాలు తప్పుబట్టినా మోదీ వినలేదని.. ఆ చట్టాలను వెనక్కి తీసుకోవడమే కాకుండా రైతులకు క్షమాపణలు కూడా చెప్పాల్సి వస్తుందని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ చెప్పారని గుర్తు చేశారు. తర్వాత రైతుల పోరాటంతో మోదీ సర్కారు సాగు చట్టాలను వెనక్కి తీసుకుని, రైతులకు క్షమాపణ చెప్పాల్సి వచ్చిందన్నారు. ఆ తర్వాతైనా ప్రతిపక్షాలకు మోదీ కొంత గౌరవం

➢ మిగతా 2వ పేజిలో..



## క్షిపణుల కొరత ఆగిన దాడులు

- అమెరికా వద్ద తరిగిపోతున్న క్షిపణుల నిల్వలు
- ప్రభుత్వ సలహాదారుల హెచ్చరికలతో తగ్గిన ట్రంప్
- ఆదివారం నిలిచిపోయిన అమెరికా, ఇరాన్ దాడులు
- హోర్ముజ్‌లో సీమైన్ తగిలి పేలిపోయిన ట్యాంకర్!
- సౌదీ ఆరామ్‌కో రిఫైనరీపై హుతీల దాడి

వాషింగ్టన్/దుబాయ్, జూలై 26: ఇరాన్‌పై దాడులు మరింత పెంచుతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల ప్రకటించారు. ఊహించనంత భారీగా దాడులు ఉంటాయనీ చెప్పారు. కానీ అందుకు విరుద్ధంగా ఇరాన్‌పై దాడుల తీవ్రత తగ్గుతూ వచ్చింది. ఆదివారం అసలు ఎలాంటి దాడులూ చేయలేదు. అమెరికాకు క్షిపణుల కొరత తలెత్తుతుండటం, దౌత్య చర్యల్లో పురోగతి, యుద్ధం మరింత విస్తరించే ప్రమాదం ఉందని రక్షణశాఖ ఉన్నతాధికారులు, సలహాదారులు హెచ్చరించడమే దీనికి కారణమని అమెరికా మీడియా వెల్లడించింది. అమెరికా ఎంతగా దాడులు చేస్తున్నా

➢ మిగతా 2వ పేజిలో..

## శుభకార్యానికి వెళ్లి వస్తూ...

- ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు
- ఇద్దరి మృతి.. మరో నలుగురికి గాయాలు
- శ్రీకాకుళం మండలం చాపురం హైవే వద్ద ఘటన



శ్రీకాకుళం క్రైం/ పోలాకి/ నరసన్నపేట, జూలై 26 ఓ శుభకార్యానికి వెళ్లి.. ఆనందంగా తిరిగి వస్తూ.. మరికొన్ని గంటల్లో ఇంటికి చేరుకుంటామనుకున్న ఆ కుటుంబంలో విషాదం రేగింది. అకస్మాత్తుగా సంభవించిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. మరో నలుగురు గాయపడ్డారు. ఈ విషాద ఘటన శ్రీకాకుళం మండలం చాపురంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

విశాఖపట్నం రూరల్ ప్రాంతానికి చెందిన బంకుపల్లి సత్య గోపాల్ శాస్త్రి(75),

➢ మిగతా 2వ పేజిలో..

## పరీక్షా విధానంలో సంస్కరణలకు..

# హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్

- నందన్ నిలేకణి నేతృత్వంలో ఏర్పాటు.. ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన
- టాస్క్‌ఫోర్స్‌లో ఇస్రో మాజీ చీఫ్ సోమనాథ్ సహా ఐదుగురు సభ్యులు
- దెబ్బతిన్న మోదీ ఇమేజ్‌ను బాగు చేసుకునే హైపవర్డ్ యత్నమిది: కాంగ్రెస్



న్యూఢిల్లీ, జూలై 26: పదేపదే ప్రశ్నపత్రాలు లీక్ అవుతుం డడంపై విద్యార్థి లోకం గళమెత్తుతు ండడంతో.. పరీక్షా విధానంలో సంస్కరణల దిశగా కేంద్రం కీలక ముందడుగు వేసింది. ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు, ఆధార్ రూపకర్త నందన్ నిలేకణి నేతృత్వంలో ఈ అంశంపై హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ఇన్‌స్టాగ్రామ్ వీడియో ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. దేశ పరీక్షా వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా, టెక్నాలజీ ఆధారిత వ్యవస్థగా మార్చడానికి తీసుకోవాల్సిన చర్యలను ఈ టాస్క్‌ఫోర్స్ సిఫారసు చేస్తుందని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్ అనంతరం విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని గుర్తుచేసిన ప్రధాని.. సంస్కరణల ద్వారా పరీక్షా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తామని చెప్పారు. “విద్యార్థుల సంక్షేమం కోసం భారత ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు తీసుకుంది. స్టూడెంట్స్ భవిష్యత్తుతో ఆడుకున్నవారు ఇప్పటికే జైళ్లలో మగ్గుతున్నారు. ఇప్పటికే మేం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేశాం. సోమవారం పార్లమెంటులో.. అత్యంత కఠినమైన నిబంధనలతో కొత్త చట్టం తెచ్చేందుకు సిద్ధమవుతున్నాం” అని మోదీ తాజా వీడియో సందేశంలో వివరించారు. ప్రభుత్వం తక్షణ చర్యల గురించి మాత్రమే కాకుండా.. దీర్ఘకాలంలో చేపట్టాల్సిన సంస్థాగత సంస్కరణల దిశగా కృషి చేస్తోందని చెప్పారు. “మనం భవిష్యత్తు గురించి కూడా ఆలోచించాలి. మన పరీక్షా వ్యవస్థ విశ్వసనీయంగా, పారదర్శకంగా ఉండాలి. టెక్నాలజీని గరిష్ఠంగా వినియోగించుకోవాలి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని.. అంతర్జాతీయంగా పేరొందిన సాంకేతిక నిపుణుడు నందన్ నిలేకనీ నేతృత్వంలో పరీక్షావిధానంలో సంస్కరణల నిమిత్తం ఒక హై-పవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను

➢ మిగతా 2వ పేజిలో..



## బంగాళాఖాతంలో వాయుగుండం

- ఉత్తరకోస్తాకు వర్షసూచన
- వేటకు వెళ్లొద్దని హెచ్చరిక

విశాఖపట్నం, అమరావతి, జూలై 26 పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒడిశాను ఆనుకొని వాయవ్య బంగాళాఖాతంలో ఉన్న అల్పపీడనం ఆదివారం తీవ్ర అల్పపీడనంగా.. అనంతరం వాయుగుండంగా బలపడింది. ఈ క్రమంలో వాయవ్యంగా పయనించి ఆదివారం మధ్యాహ్నానికి ఒడిశాలోని బాలాసోర్‌కు తూర్పు ఆగ్నేయంగా 150 కి.మీ.ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. సోమవారం ఉదయానికి తీవ్ర వాయుగుండంగా బలపడి బాలాసోర్‌కు ఉత్తరాన తీరం దాటనున్నదని వాతావరణ

➢ మిగతా 2వ పేజిలో..

# టైలర్ కుమారుడికి 1.06 కోట్ల ప్యాకేజీ

- కెనడా కంపెనీలో ఏఐ ఇంజనీర్‌గా ఉద్యోగం
- కాకినాడ జిల్లా కొత్తపల్లి యువకుడి ఘనత

కొత్తపల్లి, జూలై 26 తండ్రి టైలర్.. తల్లి కుట్టు పనిలో భర్తకు సాయంగా ఉంటుంది. ఇలాంటి పేద కుటుంబం నుంచి వచ్చిన విద్యార్థి రూ.1.06 కోట్ల వార్షిక వేతనంతో కెనడా కంపెనీలో ఏఐ ఇంజనీర్‌గా

ఉద్యోగం సాధించాడు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి మండలం కుతుకుడుమిల్లి గ్రామానికి చెందిన మాల్తి అఖిలేశ్... ఇటీవల నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయి ఆఫర్ లెటర్ అందుకున్నారు. ఇటీవలే విధుల్లో చేరిన అఖిలేశ్... ఇది పూర్తిగా వర్క్‌ఫ్రం హోం ఉద్యోగమని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మాల్తి అఖిలేశ్ తండ్రి గంగాధరరావు చెవిటి, మూగ. ఆయన టైలరింగ్ చేస్తూ వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటూ ఇద్దరు పిల్లల్ని చదివించారు. అఖిలేశ్ తల్లి భర్త కుట్టిన వస్త్రాలకు చేతిపనులు చేస్తూ ఆసరాగా ఉంటోంది. కొత్తపల్లి వీవీఎ?సలో పదో తరగతి వరకు చదివిన అఖిలేశ్.. నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ (ఎంపీసీ), సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో డేటాసైన్స్‌లో ఇంజనీరింగ్ పూర్తిచేశాడు.

## శుభకార్యానికి వెళ్లి వస్తూ...

పోలాకి మండలం గొల్లలవలస ప్రాంతానికి చెందిన గోపాలశాస్త్రి బంధువులు.. మొత్తం ఆరుగురు ఆదివారం ఉదయం కారు(ఎర్టిగా)లో విజయనగరం జిల్లా రాజాంలోని బంధువుల ఇంట్లో బాలసారె కార్యక్రమానికి వెళ్లారు. గొల్లలవలసలో కారును అద్దెకు తీసుకుని వీరు వెళ్లారు. రాజాంలో కార్యక్రమం ముగించుకుని సాయంత్రం తిరిగి వస్తుండగా శ్రీకాకుళం మండలం చాపురం హైవే వద్ద చెన్నై నుంచి కోల్‌కత్తాకు వెళ్తున్న కంటైనర్‌లారీ ఎడమభాగాన ఉన్న హుక్కుకు ఢీకొన్నారు. దీంతో కారును సుమారు యాభై మీటర్లమేర లారీ ఈడ్చుకుపోయింది. కారులో ముందుసీటులో కూర్చున్న బంకుపల్లి సత్య గోపాల్ శాస్త్రి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ పొట్టా వినయ్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన నలుగురికీ గాయలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు.. స్థానికులు.. హుటాహుటిన క్షతగాత్రులను అంబులెన్స్‌లో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి డ్రైవర్ వినయ్‌కుమార్ మరణించాడు. అలాగే క్షతగాత్రుల్లో మరో ఇద్దరు దార్లపూడి వెంకట సూర్యనారాయణ, రోజా దంపతులను మెరుగైన చికిత్స కోసంశ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సంఘటనా ప్రాంతాన్ని రూరల్ స్టేషన్ ఎస్ఐ కరణం వెంకట సురేష్ పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

### ఆగిన బతుకు బండి

చిన్నతనంలోనే ఆ యువకుడు కుటుంబ బాధ్యతలను మోయాల్సి వచ్చింది. కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ...తండ్రికి చేదోడువాదోడుగా ఉండేవాడు. ప్రమాదం రూపంలో యువకుడిని మృత్యువు బలిగొనడంతో కుటుంబం దీనంగా విలపిస్తోంది. చాపురం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసన్నపేటలోని దేశవానిపేటకు చెందిన వినయ్(26) మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. వీరు నిరుపేదలు. వినయ్ తండ్రి సింహాచలం స్థానిక హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తుండగా... తల్లి భద్రమ్మ గృహిణి. వీరికి ఇద్దరు కుమారులు కాగా, వినయ్ పెద్దవాడు.

# క్షిపణుల కొరత ఆగిన దాడులు

ఇరాన్ ఏమాత్రం వెనక్కితగ్గడం లేదు.. పైగా చవకైన డ్రోన్లు, క్షిపణులతో గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై విరుచుకుపడుతోంది. వాటిని అడ్డుకోవడానికి అమెరికా పేట్రియాట్, థాడ్ వంటి చాలా ఖరీదైన ఇంటర్‌సెప్టార్ క్షిపణులు వాడుతోంది. ఇది సుదీర్ఘంగా కొనసాగుతుండటంతో అమెరికా వద్ద క్షిపణుల నిల్వలు తగ్గిపోయాయి. దీనితో పశ్చిమాసియాలో అమెరికా స్థావరాలు, మిత్రదేశాల భద్రతపై ప్రభావం పడుతుందని సైన్యం ఆందోళన వ్యక్తం చేసినట్టు సమాచారం. మరోవైపు ఇరాన్ దెబ్బకు పశ్చిమాసియాలోని జోర్డాన్, బహ్రెయిన్ తదితర దేశాల్లో ఉన్న అమెరికా స్థావరాల్లో రక్షణ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. దీనితో రక్షణ వ్యవస్థలను తప్పించుకుని మరీ ఇరాన్ క్షిపణులు అమెరికా స్థావరాల్లో విధ్వంసం సృష్టిస్తున్నాయి. యుద్ధాన్ని మరింత విస్తరించడంపై ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, సెంట్రల్ కమాండ్ చీఫ్ డాన్ కెయిన్ ఆందోళన వ్యక్తం చేసినట్టు సమాచారం. ఈ క్రమంలోనే ఇరాన్‌పై దాడులకు కాస్త విరామం ఇవ్వాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయించారని.. భారీస్థాయిలో దాడుల కోసం సైన్యం ప్రణాళిక సిద్ధం చేసినా.. ప్రస్తుతానికి పక్కనపెట్టాలని ఆదేశించారని రక్షణ వర్గాలు తెలిపాయి. దౌత్యపరమైన చర్చలకు మార్గం సుగమం చేయాలని పేర్కొన్నారని.. అయితే ఏక్షణమైనా విరుచుకుపడటానికి సిద్ధంగా ఉండాలని కూడా సూచించారని వెల్లడించాయి.

## సీమైన్‌ను ఢీకొని పేలిన చమురు ట్యాంకర్!

తాము సూచించిన మార్గంలో కాకుండా ఒమన్ తీరానికి సమీపంగా హోర్ముజ్ జలసంధి దాటడానికి ప్రయత్నించిన ఒక చమురు ట్యాంకర్ సముద్ర మందుపాతర (సీమైన్)ను ఢీకొని పేలిపోయిందని ఇరాన్ వార్తా సంస్థ టాస్నిమ్ పేర్కొంది. అది ఏ దేశ నౌక, ఎంత మేర దెబ్బతిన్నది, ప్రాణ నష్టమేదైనా జరిగిందా అన్న వివరాలేవీ వెల్లడించలేదు. దీనిపై ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) నుంచి కూడా అధికారిక ప్రకటన ఏదీ రాలేదు.

## సౌదీ ఆరామ్‌కో రిఫైనరీపై హూతీల దాడి

సౌదీ అరేబియాలోని ఆరామ్‌కో రిఫైనరీలపై యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతున్న హూతి తిరుగుబాటుదారులు డ్రోన్ దాడులు చేశారు. ఎర్ర సముద్రతీరంలోని జిజాన్, యాంబు ప్రాంతాల్లో ఉన్న ఆరామ్‌కో చమురు కేంద్రాలపై దాడి చేశామని హూతీల సైనిక ప్రతినిధి యహ్యా సరియా ప్రకటించారు. జిజాన్‌లోని రిఫైనరీపై దాడి జరిగిందని, అక్కడ భారీగా పొగలు వెలువడుతున్నాయని రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది. యాంబు రిఫైనరీ వైపు దూసుకొచ్చిన రెండు బాలిస్టిక్ క్షిపణులను పేట్రియాట్ వ్యవస్థతో విజయవంతంగా అడ్డుకున్నట్టుగా గ్రీకు భద్రతా దళాలు వెల్లడించాయని తెలిపింది.

# బంగాళాఖాతంలో వాయుగుండం

శాఖ తెలిపింది. (జూలై ఐదో తేదీన ఉత్తర ఒడిశాకు ఆనుకుని అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారింది. మరల ఇరవై రోజుల తరువాత అదే ప్రాంతంలో అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారింది) అనంతరం వాయవ్యంగా ఉత్తర ఒడిశా, పశ్చిమబెంగాల్ మధ్య నుంచి ఛత్తీస్‌గఢ్ దిశగా పయనించనున్నదని అంచనావేస్తున్నారు. దీని ప్రభావంతో ఒడిశా, పశ్చిమబెంగాల్, ఛత?సగఢ్ లో భారీ నుంచి అతిభారీ, ఒకటి రెండుచోట్ల కుంభవృష్టి వర్షాలు కురుస్తాయి. ఉత్తరకోస్తాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, పోలవరం, విశాఖ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఒకటి, రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. ఉత్తరాంధ్ర తీరంలో సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో ఈ నెల 29 వరకు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం ఓడరేవుల్లో ఒకటో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు. కళింగపట్నం, భీమునిపట్నం ఓడరేవుల అధికారులకు సమాచారం అందించారు. కాగా, రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో ఆదివారం ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. కావలి, జంగమహేశ్వరపురంలో 39.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

# పరీక్షా విధానంలో సంస్కరణలకు.. హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్

ఏర్పాటు చేయాలని మేం నిర్ణయించాం" అని మోదీ పేర్కొన్నారు. భవిష్యత్తులో నిర్వహించే పరీక్షల విశ్వసనీయతను మరింత మెరుగుపరచేందుకు.. ఆ టాస్క్‌ఫోర్స్ చేసే సిఫారసులను వీలైనంత త్వరగా అమలుచేస్తామన్నారు. కాగా.. మోదీ ప్రకటించిన హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌పై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ఇది పేపర్‌లీక్ విషయంలో దారుణంగా దెబ్బతిన్న ప్రధాని మోదీ ఇమేజ్‌ని బాగుచేసుకునేందుకు చేస్తున్న హై-పవర్డ్ ప్రయత్నం అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ ఎద్దేవా చేశారు. 2024 జూన్‌లో సైతం.. నీట్ సహా పలు పరీక్షల నిర్వహణలో విఫలమైన మోదీ సర్కారు డాక్టర్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలో ఒక హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. మళ్లీ 2026 జూలైలో కూడా నీట్ సహా పలు పరీక్షల నిర్వహణలో విఫలమై హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను నియమించిందంటూ మోదీ సర్కారు వైఫల్యాలపై 'ఎక్స్' వేదికగా ధ్వజమెత్తారు. రాధాకృష్ణన్ కమిటీ చేసిన 101 సిఫారసులను మోదీ సర్కారు ఇంకా అమలు కూడా చేయకముందే కొత్త కమిటీ వచ్చిందని వ్యంగ్యంగా అన్నారు. 2024, 2026 నడుమ మోదీ సర్కారు ఎన్‌టీఏకు ఫుల్‌టైమ్ డైరెక్టర్ జనరల్‌ను కూడా నియమించలేకపోయిందని దుయ్యబట్టారు.

### యువతకు సాధికారతే మా లక్ష్యం

దేశంలో యువతీ యువకులంతా ఆత్మవిశ్వాసం, ఆత్మనిర్భరతతో సాధికారత సాధించేలా చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని మోదీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం 'మై భారత్' ద్వారా చేపట్టిన వికసిత్ వైబ్రెంట్ విలేజ్ కార్యక్రమానికి ఎంపికైన 400 మంది యువతతో ప్రధాన మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం మాట్లాడారు. నేటి యువతలో ఒంటరిగా (సోలో) ప్రయాణించడం ఓ ట్రెండ్‌గా మారుతోందని మోదీ అన్నారు. ఓ వ్యక్తి ప్రపంచంతోపాటు తనని తాను తెలుసుకునేందుకు సోలో ట్రావెలింగ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఒంటరిగా ప్రయాణం మొదలుపెట్టిన మీరంతా ఓ కుటుంబం అయ్యారని వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న యువతను ఉద్దేశించి అన్నారు. కాగా, భారతదేశ సరిహద్దుల్లో ఉన్న గ్రామాలను దేశ తొలి గ్రామాలనే భావన తీసుకురావడం, అక్కడి ప్రజలను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా వికసిత్ వైబ్రెంట్ విలేజ్ కార్యక్రమాన్ని రూపొందించారు. ఆన్‌లైన్‌లో ప్రత్యేకంగా నిర్వహించిన పోటీ ద్వారా దేశ నలమూలలుకు చెందిన 400 మంది యువతను ఈ కార్యక్రమానికి ఎంపిక చేశారు. వీరంతా జూన్ 4 నుంచి జూన్ 30 వరకు వికసిత్ వైబ్రెంట్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని ఎంపిక చేసిన 74 గ్రామాల్లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### టాస్క్‌ఫోర్స్‌లో ఎవరున్నారంటే..

నందన్ నిలేకణి: ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు, ఆ సంస్థ నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్, ఎస్.సోమనాథ్: ఇస్రో మాజీ చైర్మన్,తపన్ డేకా: ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్,వి.కామకోటి: ఐఐటీ మద్రాస్ డైరెక్టర్,అనితా కర్వాల్: కేంద్ర విద్యాశాఖ మాజీ కార్యదర్శి, అమృత్‌లాల్ మీనా: లాజిస్టిక్స్ నిపుణుడు, 1989 బ్యాచ్ ఐఏఎస్ అధికారి (బిహార్ క్యాడర్).

# మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌తో కలిపే.. యువతరం బిల్లు

ఇస్తారని, పార్లమెంట్‌లో చర్చకు అవకాశం కల్పిస్తారని భావించామని.. కానీ వారి వైఖరి మారలేదని చెప్పారు. అనేక ప్రవేశ, నియామక పరీక్షల నిర్వహణలో కేంద్రం పూర్తిగా విఫలమైందని.. ప్రతిపక్షాల సూచనలు, హెచ్చరికలను పట్టించుకోలేదని మండిపడ్డారు. పైగా ఈడీ, ఐటీ, సీబీఐ వంటి కేంద్ర సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాలను బెదిరించడం, ఒత్తిడి తేవడం కొనసాగించిందని మండిపడ్డారు. ఇప్పుడు దేశ యువత గల్లీ నుంచి పార్లమెంటు వరకు బలాన్ని చూపడంతో 56 అంగుళాల ఛాతీ నిలబడలేక పోయిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రతిపక్షాలు, మిత్రపక్షాల సూచనలు పట్టించుకోకుంటే యువత వీధుల్లోకి వచ్చేస్తుందని, ప్రభుత్వానికి ప్రజలు ఎదురుతిరుగుతారని మోదీ సర్కారుకు ఇప్పుడు అర్థమైందని పేర్కొన్నారు. కేవలం వికసిత్ భారత్, సబ్‌కా సాథ్- సబ్‌కా వికాస్ వంటి నినాదాలతోనే దేశ అభివృద్ధి జరగదని.. యువశక్తిని సరైన దిశలో నడిపించి, దేశ భవిష్యత్తును నిర్మించాలని స్పష్టం చేశారు.

### మార్పు రావాలి..

స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో అప్పటి పరిస్థితులను బట్టి శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి 25 ఏళ్లు, శాసనమండలి, రాజ్యసభకు 30 ఏళ్లను కనీస వయసుగా నిర్ణయించారని సీఎం రేవంత్ గుర్తు చేశారు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయని.. అందరికీ విద్య అందుబాటులోకి వచ్చిందని, ప్రజల్లో అవగాహనా శక్తి పెరిగిందని చెప్పారు. మన యువత ప్రతి నిమిషం కొత్త విషయాలు నేర్చుకుంటూ ప్రపంచాన్ని గమనిస్తోందని, దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావడానికి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. "ఇప్పుడు 21 ఏళ్ల వయసున్న యువత ఐఏఎ?సలు, ఐపీఎ?సలు అవుతున్నారు. యూనికార్న్ కంపెనీలు స్థాపిస్తున్నారు. ఫార్చ్యూన్-500 కంపెనీలకు సీఈఓలుగా బాధ్యతలు చేపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా తమ ప్రతిభ, జ్ఞానం, సామర్థ్యాన్ని నిరూపిస్తున్నారు. అలాంటి యువతకు రాజకీయాల్లో నాయకత్వం వహించే అవకాశం ఎందుకు ఇవ్వకూడదు? కాలానుగుణంగా చట్టాలను మార్చాల్సిన అవసరం ఉంది. ఇప్పటివరకు రోడ్లపై పోరాటం చేసిన యువత.. ఇకపై పార్లమెంట్‌లోకి వచ్చి దేశ భవిష్యత్తును నిర్ణయించాలనుకుంటోంది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాదొక సూచన. ఈ అంశంపై లోతుగా ఆలోచించండి. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని చట్టం చేయండి" అని ప్రధాని మోదీని సీఎం రేవంత్ కోరారు. యువతను రాజకీయ వ్యవస్థలో భాగస్వామ్యం చేస్తే.. దేశ భవిష్యత్తు మారుతుందని, ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా భారత్ ఎదుగుతుందని చెప్పారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన సమయం వచ్చిందని తాను భావిస్తున్నానన్నారు.

### అసెంబ్లీలో చర్చించి.. తీర్మానం చేస్తాం

లోక్‌సభ, శాసనసభలకు పోటీచేసే కనీస వయసును 21 ఏళ్లకు తగ్గించే అంశంపైన సమగ్రంగా చర్చించేందుకు ఆగస్టులో రాష్ట్ర శాసనసభ, మండలి సమావేశాలను ఏర్పాటు చేస్తామని రేవంత్ చెప్పారు. ప్రతిపక్షాల అభిప్రాయం కూడా తీసుకుంటామని తెలిపారు. పోటీ కనీస వయసును శాసనసభ, లోక్‌సభలకు 21 ఏళ్లకు, శాసనమండలి, రాజ్యసభలకు 25 ఏళ్లకు తగ్గించాలని తీర్మానం చేస్తామని.. దేశానికి ఒక సందేశం ఇస్తామని వెల్లడించారు.

### ప్రజల మాట వినాల్సిన సమయం వచ్చింది

బీజేపీ ప్రభుత్వాన్ని ఎవరైనా విమర్శిస్తే.. దేశాన్నే విమర్శిస్తున్నారంటూ, అర్బన్ నక్సల్స్, విదేశీ శక్తుల హస్తం ఉందంటూ ఆరోపణలు చేయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని సీఎం రేవంత్ మండిపడ్డారు. మన్ కీ బాత్ పేరుతో రేడియోలో మాట్లాడటం కాదు.. ఇప్పుడు ప్రధాని మోదీ ప్రజల మాట వినాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కూడా 'జై జవాన్- జై కిసాన్' నినాదానికి 'జై యువత'ను కూడా జోడించాల్సిన సమయం వచ్చిందన్నారు.

## ఇక ప్రధాని క్షమాపణకు పట్టు!

విద్యార్థులపై పోలీసుల దాడి
వ్యవహారంలో పార్లమెంటులో నిలదీసేందుకు విపక్షాలు సన్నద్ధం
నేడు ఖర్గే చాంబర్లో కూటమి భేటీ నేడే లోక్‌సభలో పరీక్షల బిల్లు

న్యూఢిల్లీ, జూలై 26 కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా ప్రతిపక్షాల్లో కదనోత్సాహాన్ని పెంచింది. జంతర్‌మంతర్‌లో విద్యార్థులపై పోలీసుల దాడులకు ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పేలా పార్లమెంటు వేదికగా ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచాలని భావిస్తున్నాయి. మరోవైపు, ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడితే కఠిన శిక్ష విధించాలని ప్రతిపాదిస్తూ ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో చట్టసవరణ బిల్లు తీసుకురానుంది. ఈ నేపథ్యంలో ఇండియా కూటమి నేతలు ఉదయం ఖర్గే చాంబర్‌లో సమావేశమై ఉభయసభల్లో అనుసరించాల్సిన వ్యూహాన్ని సిద్ధం చేయనున్నారు. ఇంకోవైపు, విద్యార్థులపై పోలీసుల దాడి వ్యవహారాన్ని రాజ్యసభలో చర్చించాలని 267వ నిబంధన కింద టీఎంసీ నోటీసిచ్చింది. సోమవారం జీరో అవర్, ప్రశ్నోత్తరాలు, ఇతర కార్యకలాపాలన్నీ సస్పెండ్ చేసి దీనిపై చర్చ జరపాలని ఆ పార్టీ ఎంపీ సాగరికా ఘోష్ అందులో కోరారు.

# ఇందిరమ్మ ఇళ్లకు టెండర్లు

నియోజకవర్గాల్లో.. ఇప్పటివరకు స్థలాలు గుర్తించిన 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఎల్‌ఐజీ టవర్ల నిర్మాణ పనులు చేపట్టేందుకు టెండర్లను ఆహ్వానించింది. బుధవారం (ఈ నెల 29) నుంచి ఆగస్టు 19 మధ్యాహ్నం 3 గంటల వరకు టెండర్లను స్వీకరించనున్నారు. మొత్తం 16 ప్రాంతాల్లో నిర్మించే ఇందిరమ్మ ఎల్‌ఐజీ టవర్లను 10 ప్యాకేజీలుగా విభజించి టెండర్లను ఆహ్వానించారు. ఒక్కో టవర్‌ను స్టిల్ట్ ం 10 అంతస్తులతో నిర్మించాలని టెండర్ నోటీసులో పేర్కొన్నారు. నిర్మాణాన్ని సంప్రదాయ/మోనోలిథిక్ కాంక్రీట్ నిర్మా ణం లేదా మరేదైనా వినూత్న సాంకేతికత (షీర్‌వాల్ టెక్నాలజీ/ప్రీకాస్ట్ టెక్నాలజీ లేదా తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆమోదించిన విధంగా)తో ఒక్కో ఫ్లాట్‌ను 528.58 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించాలని పేర్కొన్నారు. దీంతోపాటు నేల పరిస్థితులకు తగిన పునాదులు, సివిల్ పను లు, అంతర్గత మౌలిక సదుపాయాల కింద నీటి సరఫరా, శానిటరీ ఫిట్టింగ్‌లు, అంతర్గత విద్యుదీకరణ, లిఫ్టులు, ఫైర్ సేఫ్టీతో నిర్మాణాలు ఉండాలని టెండర్ నోట?సలో పొందుపరిచారు. అంతేకాకుండా.. ఈ పనులన్నింటికీ రెండేళ్ల డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ (నిర్మాణంలో ఏవైనా లోపాలు, తప్పులు ఉంటే వాటికి నిర్మాణ సంస్థే బాధ్యత వహించే) నిబంధనను కూడా పెట్టారు. జీహెచ్‌ఎంసీ లైసెన్స్ ఉన్న బిల్డర్లు ఈ టెండర్లలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తొలిసారిగా ఇంజనీరింగ్-ప్రొక్యూర్‌మెంట్-కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. ఈ విధానం ఎక్కువగా జాతీయ రహదారులు, రాష్ట్రంలోని ప్రత్యేక కారిడార్ల నిర్మాణంలో ఉంటుంది. త్వరితగతిన నిర్మాణం, నాణ్యతతో ఉండేందుకే ఈపీసీ పద్ధతిని తీసుకొస్తున్నట్టు హౌసింగ్ బోర్డు ఇంజనీరింగ్ విభాగం అధికారులు తెలిపారు. హౌసింగ్ బోర్డు టెండర్ నోట?సలో ఇచ్చిన ప్యాకేజీల ప్రకారం.. ఒక్క హైదరాబాద్ జిల్లా పరిధిలోనే దాదాపు 3,500 ఫ్లాట్లు రానున్నాయి. ఆ తరువాత రంగారెడ్డి జిల్లాకు 1,920, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు 1,920 చొప్పున ఫ్లాట్లు దక్కనున్నాయి.

### తొలి విడతలోని 10 ప్యాకేజీలు ఇవే..

ప్యాకేజీ-1లో రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవ్‌పల్లిలో 480 ఫ్లాట్లు, మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని జల్‌పల్లి వద్ద 480 ఫ్లాట్లు కలిపి మొత్తం 960 ఫ్లాట్లకు రూ.86.40 కోట్లతో టెండర్ ఇచ్చారు.

ప్యాకేజీ-2లో హైదరాబాద్ జిల్లా పరిధిలోని నాంపల్లి వద్ద ఉన్న రెడ్‌హిల్స్‌లో 480 ఫ్లాట్లు, కుల్సుంపురలో 480, బహదూర్‌పురలోని ముసలైగూడలో 480 ఫ్లాట్లు కలిపి మొత్తం 1440 ఫ్లాట్లకు రూ.129.60 కోట్లతో టెండర్. (అన్ని ప్యాకేజీల్లో ఇదే అత్యధికం).

ప్యాకేజీ-3లో రూ.86.40 కోట్లతో రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని రాయదుర్గంలో 480 ఫ్లాట్లు, షేక్‌పేట మండలంలోని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో 360 ఫ్లాట్లు, హకీంపేట దర్గాలో 120 ఫ్లాట్లు.

ప్యాకేజీ-4: హైదరాబాద్ జిల్లా పరిధిలోని సైదాబాద్ మండలం గడ్డిఅన్నారంలో 480 ఫ్లాట్లు, అంబర్‌పేట మండలంలోని అంబర్‌పేట సీపీఎల్‌లో 480 ఫ్లాట్లకు రూ.86.40 కోట్లతో టెండర్.

ప్యాకేజీ-5: రూ.55.80 కోట్లతో బేగంపేట మండలంలోని పాటిగడ్డలో 480 ఫ్లాట్లు, తిరుమలగిరి మండలంలోని బోయిన్‌పల్లిలో 140 ఫ్లాట్లు.

ప్యాకేజీ-6: రూ.43.20 కోట్లతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి మండలంలోని కేపీహెచ్‌బీ కాలనీలో 480 ఫ్లాట్లు.

ప్యాకేజీ-7: రూ.43.20 కోట్లతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలోని గాజులరామారంలో 480 ఫ్లాట్లు.

ప్యాకేజీ-8: రూ.43.20 కోట్లతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మండలంలోని కౌకూర్‌లో 480 ఫ్లాట్లు.

ప్యాకేజీ-9: రూ.43.20 కోట్లతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలంలోని పోచారం ఎల్‌ఐజీ కాలనీలో 480 ఫ్లాట్లు.

ప్యాకేజీ 10: రూ.43.20 కోట్లతో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బండ్లగూడ ఎల్‌ఐజీ కాలనీలో 480 ఫ్లాట్లు.

## ఘనంగా పోచమ్మ తల్లి బోనాల మహోత్సవాలు

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ విప్ నల్లాల ఓదెలు.



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జూలై 26/ అక్షరం న్యూస్ –:

మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని యాపల్ లో ఆదివారం శ్రీ పోచమ్మ తల్లి బోనాల మహోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈప్రత్యేక కార్యక్రమానికి చెన్నూరు నియోజకవర్గ మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు నల్లాల ఓదెలుని ఘనంగా శాలువాతో సన్మానించి ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం ఓదెలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విలసిల్లాలని ప్రార్థించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న శివశక్తులు నల్లాల ఓదెలుకి ఆశీర్వాదాలు అందించి, అమ్మవారి కృప ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగగా, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన మహనీయుడు ఛత్రపతి సాహు మహారాజ్



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 26 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:

దేశంలోనే తొలిసారిగా తన కొల్హాపూర్ సంస్థానంలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసి సామాజిక న్యాయానికి బాటలు వేసిన మహనీయుడు ఛత్రపతి సాహు మహారాజ్ అని పలువురు వక్తలు కొనియాడారు. రిజర్వేషన్ల దినోత్సవం సందర్భంగా ఆదివారం గోదావరిఖని తెలంగాణ అంబేద్కర్ ట్రస్ట్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది గొర్రె రమేష్, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైస రాజేష్, అంబేద్కర్ వాది మంతెన మధు మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో సాహు మహారాజ్ 50 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని పేర్కొన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్‌కు ఆర్థికంగా అండగా నిలిచి ఆయన విద్యాభ్యాసానికి తోడ్పడిన గొప్ప సంస్కర్త కూడా సాహు మహారాజేనని గుర్తు చేశారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గోదావరిఖని పట్టణంలో ఛత్రపతి సాహు మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్, ఏఐటీయూసీ, సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్, మేయర్ మహంకాళి స్వామికి విజ్ఞప్తి చేశారు. పెగడపల్లి నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కంపెల్లి సతీష్, ఇరుగురాల కృష్ణయ్య, కందుకూరి రాజారత్నం, ఆకునూరి బాలంకుస్, బూడిద సమ్మయ్య, బూడిద మహేందర్, పుల్లూరి మహేందర్, ఎం.ఏ. కరీం, శనిగారపు చంద్రశేఖర్, పొనుగంటి రాజనర్సు, శనిగారపు రామస్వామి, జనగామ శంకర్, శనిగారపు పోచయ్య, కనకం గణేష్, పంజా అశోక్, కోరే శంకర్, కలువల రాజేశం, దొమ్మటి శేఖర్, రామగిరి రమేష్, కల్వల మహేందర్, పెరిక రవి, బొంకూరి పవన్ కుమార్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ సందర్భంగా ఆర్‌జీ-2 జీఎం

# బండి వెంకటయ్య దంపతులకు ఘన సన్మానం





జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 26 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: సింగరేణి రామగుండం ఏరియా-2 జీఎం బండి వెంకటయ్య ఈ నెల 31న పదవీ విరమణ పొందనున్న సందర్భంగా ఆదివారం సెక్టార్-3 ఎన్‌సీఓఏ క్లబ్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి వెంకటయ్య, వనజ దంపతుల షష్టిపూర్తి వేడుకలను కూడా కుటుంబ సభ్యులు, సహోద్యోగుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఆపరేషన్స్ డైరెక్టర్ ఎల్.వి. సూర్యనారాయణ, యంత్రాలు--విద్యుత్ విభాగం డైరెక్టర్ తిరుమల్ రావు, భద్రత విభాగం జీఎం మల్లయ్య, ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్, ఆర్‌జీ-3 జీఎం మధుసూధన్, ఏఎల్‌పీ జీఎం నాగేశ్వరరావు, బెల్లంపల్లి జీఎం రమేష్‌తో పాటు పలు ఏరియాల జీఎంలు, ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు, బంధుమిత్రులు హాజరై బండి వెంకటయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. ఆపరేషన్స్ డైరెక్టర్ ఎల్.వి. సూర్యనారాయణ మాట్లాడుతూ, బండి వెంకటయ్య రామగుండం ప్రాంతంలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి తన కృషి, నాయకత్వంతో జీఎంగా ఎదిగారని అన్నారు. అత్యధిక ఉత్పత్తి, ఉత్పాదకత సాధనకు నిరంతరం శ్రమించారని కొనియాడారు. క్రమశిక్షణ, వ్యూహాత్మక ఆలోచనలతో సమస్యలను సమర్థంగా పరిష్కరిస్తూ సంస్థ అభివృద్ధికి విశేష సేవలందించారని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఇతర వక్తలు మాట్లాడుతూ, బండి వెంకటయ్య సుమారు 39 సంవత్సరాల పాటు సింగరేణి సంస్థకు విశేష సేవలందించారని, ఆయన నిబద్ధత, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు యువ అధికారులకు ఆదర్శప్రాయమని కొనియాడారు. అనంతరం అతిథులకు విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.



## ట్రాన్స్‌ఫార్మర్లపై దొంగల కన్ను, రైతులకు తీరని నష్టం..

- వరుస ట్రాన్స్‌ఫార్మర్ చోరీలు
- రైతుల్లో పెరుగుతున్న ఆందోళన



సూర్యాపేట /నేరేడుచర్ల, జూలై 26:అక్షరం న్యూస్ ।

నేరేడుచర్ల పట్టణ పరివాహక ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్నారని ఆదివారం గమనించి రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం, గత 15 రోజుల వ్యవధిలో వేర్వేరు ప్రాంతాల్లో రెండు విడతల్లో ట్రాన్స్‌ఫార్మర్లలోని బుష్‌లు, ఇతర విద్యుత్ పరికరాలు చోరీకి గురయ్యాయి. ఇప్పటికే వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక రైతులు బోర్లు, బావులపై ఆధారపడి వ్యవసాయం సాగిస్తున్న సమయంలో ఈ దొంగతనాలు మరింత ఇబ్బందులు కలిగిస్తున్నాయని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని పరికరాలు చోరీకి గురైతే ఒక్కోసారి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ఖర్చు అవుతుందని, ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ లీక్ అయితే రూ.10 వేలకుపైగా వ్యయం చేయాల్సి వస్తోందని రైతులు పేర్కొన్నారు. గత 15 రోజుల్లో దాదాపు 25 ట్రాన్స్‌ఫార్మర్ల పరికరాలు చోరీకి గురైనట్లు వారు వెల్లడించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, దొంగలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

## గోదావరిఖనిలో ఐఎఫ్ఎస్ విజేత శశాంక్‌కు ఘన సన్మానం



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 26 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: గోదావరిఖనికి చెందిన భారత అటవీ సేవ (ఐఎఫ్ఎస్) విజేత దహేగామ శశాంక్‌కు "ఖని" స్నేహసాహితి గ్రంథాలయంలో ఆదివారం ఘన సన్మాన అభినందన సభ నిర్వహించారు. రైతు సంక్షేమ సమితి, స్నేహసాహితి గ్రంథాలయం, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్‌జీ-1 జిఎం లలిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లలిత్ కుమార్ మాట్లాడుతూ, ఐఎఫ్ఎస్‌లో ఎంపికైన దహేగామ శశాంక్‌తో పాటు ఆయన తల్లిదండ్రులు ఉమామహేశ్వర్, నాగలక్ష్మిలను అభినందించారు. అలాగే కానిస్టేబుల్‌గా ఎంపికైన ప్రవళికను కూడా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గని ప్రాంతాల నుంచి ఐఏఎస్, ఐఎఫ్ఎస్, గ్రూప్-1, గ్రూప్-2 వంటి ఉన్నతఉద్యోగాలకు యువత ఎంపిక కావడం ఎంతో ఆనందకరమని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ కూడా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఐఎఫ్ఎస్ విజేత శశాంక్ మాట్లాడుతూ, తన విజయానికి సహకరించిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత కష్టపడి చదివి లక్ష్యాలను సాధించాలని, జ్ఞానం, విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఏలేశ్వరం వెంకటేష్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ముడిమడుగుల మల్లన్న, సీహెచ్ ఉపేందర్, వేల్పుల నారాయణ, పుట్ట రాజన్న, వేముల అశోక్, జేవీ రాజు, మహేష్, మేకల సమ్మయ్య, అబ్బాస్, దామరి శంకర్, జ్యోతి, ఆకుల రామ్‌కిషన్, ములుగు వెంకటేష్, మార్వాడి సుదర్శన్, సల్పాల రమేష్, ఎరుకల రాజయ్య, ఎరుకల పోశయ్య, ఎలకటూరి శంకర్, ఉదయ్ బక్కి, ఎనగంటి శ్రీనివాస్, జమాతే ఇస్లామీకి చెందిన ఫసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాబేజీ బోండా

### కావలసిన పదార్థాలు



క్యాబేజీ : చిన్నది ఒకటి, పచ్చిమిరపకాయలు: నాలుగు, కొత్తిమీర: పెద్ద కట్ట కరివేపాకు: నాలుగు రెబ్బలు. బియ్యప్పిండి: కప్పు, శనగపిండి: ముప్పావు కప్పు జీలకర్ర: టీ స్పూను, ఉప్పు: తగినంత, నూనె: పావు లీటరు.

### తయారు చేసే విధానం

ముందుగా క్యాబేజీని కాస్త పెద్ద ముక్కలుగా అంటే అరంగుళం చొప్పున క్యూబ్ తరహాలో తరుక్కోవాలి. అవి సుమారు రెండు, రెండున్నర కప్పుల ముక్కలు వచ్చేలా చూసుకోవాలి. పచ్చిమిరపకాయలను సన్నగా, పొడుగ్గా తరగాలి. కొత్తిమీరను సన్నగా తరుక్కోవాలి. ఇది కనీసం పావుకప్పు రావాలి. ఇప్పుడు క్యాబేజీ ముక్కల్ని ఒక గిన్నెలోకి తీసుకుని అందులో శనగపిండి, బియ్యప్పిండి, జీలకర్ర, కొద్దిగా ఉప్పు, పచ్చిమిర్చి, కొత్తిమీర తరుగు వేయాలి. మిశ్రమానికి తగినంత ఉప్పు చల్లాలి. కరివేపాకునీ జోడించాలి. ఇప్పుడు పైన నీళ్లు చల్లి ఈ మిశ్రమాన్ని ముద్దగా కలుపుకోవాలి. పిండి జారుడుగా కాకుండా, కాస్త గట్టిగానే ఉండనివ్వాలి. ఇప్పుడు వీటిని చిన్న చిన్న గుండ్రటి ఉండలుగా చేసి నూనెలో వేయిస్తే కరకరలాడుతూ రుచిగా ఉంటాయి.

# తబిత ఆశ్రమంలో ఆషాఢ మాసం గోరింటాకు సంబరాలు






జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 26 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం పట్టణంలోని తబిత ఆశ్రమంలో ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం గోరింటాకు సంబరాలను రామగుండం స్వచ్ఛంద సంస్థల ఐక్య వేదిక, శ్రీ సీతారామ సేవా సమితి ఆధ్వర్యంలో గోలివాడ చంద్రకళ నిర్వహించారు. ఆశ్రమంలోని చిన్నారులతో కలిసి మహిళలు గోరింటాకు దంచి, సంప్రదాయబద్ధంగా ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆనందోత్సాహాల మధ్య వేడుకలను జరుపుకున్నారు. చిన్నారులతో మమేకమై వారికి ఆప్యాయతను పంచుతూ అందరూ సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని పిల్లలకు ప్రేమాభిమానాలు అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పలువురు అభిప్రాయపడ్డారు. ఇలాంటి కార్యక్రమాలు చిన్నారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో సేవా భావాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్, సబిత ఆశ్రమ నిర్వాహకుడు విరేందర్, లెనిన్, మహిళా సభ్యులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు. అలాగే రామగుండం 26వ డివిజన్ కార్పొరేటర్ బాధవత్ నర్సమ్మ, సారయ్య నాయక్ హాజరై ఆశ్రమంలోని చిన్నారులను అభినందించి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బీజేపీ బి ఎల్ ఏ 2 మరియు టోలీ సమావేశం



ఓదెల జులై 26ఓదెల అక్షరం న్యూస్

మండల కేంద్రం లక్ష్మీప్రసన్న ఫంక్షన్ హాల్ లో బీజేపీ మండల అధ్యక్షులు కారెంగుల శ్రీనివాస్ అధ్యక్షతన ఎస్ఐఆర్ కీ సమబందించి స్థానిక బూత్ ల వారీగా బీజేపీ పార్టీ డిఎల్ఏ 2 మరియు టో?లీ టీమ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ ఐ ఆర్ జోనల్ ఇంచార్జ్ అంథోని రెడ్డి హాజరు అయ్యి బి ఎల్ ఎ 2 మరియు టో?లీ టీమ్ సభ్యులకు ఎస్ ఐ ఆర్ కీ సంబందించిన పూర్తి సమాచారాన్ని దిశా నిర్దేశం చేశారు

ఈ కార్యక్రమంలో ఎస్ ఐ ఆర్ అసెంబ్లీ కో ఆర్డినేటర్ గొట్టిముక్కుల సురేష్ రెడ్డి ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు రాంజీ నాయక్, బిల్ ఏ 1 బెజ్జంకి దిలీప్, మండల అధ్యక్షుడు కారెంగుల శ్రీనివాస్, తీర్దాల కుమారస్వామి, మండల ఉపాధ్యక్షులు రామినేని రాజేంద్రప్రసాద్, కార్యదర్శి కొత్తిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బూతు అధ్యక్షులు మరియు బిల్ ఏ 2లు బిజెపి నాయకులు పాల్గొన్నారు

## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువత సాధించిన ఘనవిజయం మహమ్మద్ అయూబ్




వరంగల్ జిల్లా / వరంగల్ టౌన్ / జూలై 26 / అక్షరం న్యూస్ - : కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఈ దేశ యువ చైతన్యం సాధించిన ఘన విజయమని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ అన్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ నీట్ పేపర్ ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా పరీక్షల నిర్వహణపై తీవ్ర వివాదం నెలకొన్న విషయము అందరికీ తెలిసిందే దేశంలో మహిళలు, యువత చేస్తున్న పోరాటాలకు ఈ విజయం స్ఫూర్తినిస్తుందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే అవినీతి బురదలో నిండా మునిగిపోయిన బీజేపీ కూటమి ప్రభుత్వానికి పతనం మొదలైందని అయూబ్ అన్నారు. విద్యావ్యవస్థతో పాటు అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించి, దేశ యువత ఆశలను, ఆశయాలను అధికార మదంతో అణచివేయాలని చూసిన మోడీ నియంతృత్వానికి రోజులు దగ్గర పడ్డాయని మహమ్మద్ అయూబ్ విమర్శించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఈ దేశ యువత పోరాటాన్ని ఆపబోదని, రాబోయే కాలంలో అన్ని శాఖల మంత్రులు, మోడీతో సహా బిజెపి ప్రభుత్వం గద్దె దిగాల్సి వస్తుందని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ హెచ్చరించారు.

## మహిళలు తరచూ స్ట్రెంగ్త్ ట్రెయినింగ్ వ్యాయామాలు చేస్తే.. ఎన్నో లాభాలు..

చాలా మంది మహిళలు వ్యాయామం విషయంలో ప్రధానంగా కార్డియోపై ఎక్కువగా దృష్టి పెడతారు. త్వరగా బరువు తగ్గాలంటే కార్డియో మంచిదని, వెయిట్ ట్రైనింగ్ చేస్తే శరీరం స్థూలంగా కనిపిస్తుందని ఒక సాధారణ అపోహ చాలా మందిలో ఉంది. కానీ వాస్తవానికి స్ట్రెంగ్త్ ట్రైనింగ్ మహిళలకు ఎక్కువ ప్రయోజనాలను అందిస్తుంది. ఇది కేవలం కొవ్వు తగ్గించడమే కాకుండా శరీరాన్ని లోపల నుంచి బలపరుస్తుంది. ఆరోగ్యం, ఫిట్‌నెస్ విషయానికి వస్తే కార్డియో కంటే స్ట్రెంగ్త్ ట్రైనింగ్ కు ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయి. వయస్సు 20 నుంచి 60 ఏళ్లు, ఎంతైనా సరే.. మహిళలకు స్ట్రెంగ్త్ ట్రైనింగ్ తప్పనిసరి. జిమ్ నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా ఇది శరీరాన్ని ప్రభావితం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. స్ట్రెంగ్త్ ట్రైనింగ్ వల్ల మహిళలకు కలిగే ప్రయోజనాల గురించి కూడా వారు తెలియజేస్తున్నారు. మహిళలకు స్ట్రెంగ్త్ ట్రైనింగ్ ఎందుకు ముఖ్యమైనది, దాని వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### ఎముకలు బలంగా మారుతాయి..

స్ట్రెంగ్త్ ట్రైనింగ్ ద్వారా కండరాలుపెరుగుతాయి. దీని వల్ల బేసల్ మెటాబాలిక్ రేట్ పెరుగుతుంది. అంటే విశ్రాంతిలో ఉన్నప్పటికీ ఎక్కువ కాలరీలు ఖర్చవుతాయి. కార్డియో కేవలం వ్యాయామ సమయంలో మాత్రమే కాలరీలు బర్న్ చేస్తుంది. అలాగే మహిళల్లో వయస్సు పెరిగే కొద్దీ, ముఖ్యంగా మెనోపాజ్ తర్వాత ఆస్టియోపొరోసిస్ ప్రమాదం పెరుగుతుంది. స్ట్రెంగ్త్ ట్రైనింగ్ ఎముకల సాంద్రతను పెంచి ఎముకల ప్రమాదాలను తగ్గిస్తుంది. రోజువారీ పనుల నుండి సరుకులు ఎత్తడం, పిల్లలతో ఆడడం వంటి పనులన్నింటికీ శక్తి అవసరం పడుతుంది. స్ట్రెంగ్త్ ట్రైనింగ్ వల్ల ఈ పనులన్నింటినీ సులభంగా చేయగలుగుతారు. స్ట్రెంగ్త్ ట్రైనింగ్ హార్మోన్ల స్థాయిలపై సానుకూల ప్రభావాన్ని చూపిస్తుంది. ఇది ఎండార్ఫిన్స్ పెంచి, కార్టిసోల్ ను నియంత్రిస్తుంది. దీని వల్ల మానసిక స్థితి మెరుగుపడి, ఒత్తిడి తగ్గుతుంది. అలాగే బలమైన కండరాలు కీళ్లకు మద్దతును ఇస్తాయి. దీని వల్ల గాయాల ప్రమాదం తగ్గుతుంది ,సమతుల్యత మెరుగుపడుతుంది.

### షుగర్ లెవల్స్ అదుపులో..

అలాగే స్ట్రెంగ్త్ ట్రైనింగ్ వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. దీని వల్ల టైప్ 2 డయాబెటిస్ ప్రమాదం సుమారు 30% వరకు తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా 35 సంవత్సరాల తర్వాత మహిళల్లో శారీరక సామర్థ్యం తగ్గడం ప్రారంభమవుతుంది. కానీ రెగ్యులర్ స్ట్రెంగ్త్ ట్రైనింగ్ వల్ల శరీర బలం, స్వతంత్రత ఎక్కువ కాలం నిలుస్తాయి. మహిళలకు స్ట్రెంగ్త్ ట్రైనింగ్ ఇలా అనేక రకాల ప్రయోజనాలను అందిస్తుందని వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా బరువులు ఎత్తడం వల్ల మహిళలు లావుగా కనిపించరని కూడా వారు చెబుతున్నారు.

## పీఆర్టీయూ టీఎస్ నేరేడుచర్ల మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక







సూర్యాపేట /నేరేడుచర్ల / జూలై 26 / అక్షరం న్యూస్

పీఆర్టీయూ టీఎస్ నేరేడుచర్ల మండల సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షుడు ఎడవెల్లి సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు తంగేళ్ల జితేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తీగల నరేష్, రాష్ట్ర ఆడిట్ కమిటీ వైస్ చైర్మన్ చల్లా ప్రభాకర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మాతంగి సైదులు, నేరేడుచర్ల, పాలకవీడు మండల విద్యాధికారులు ఎం. బాలు నాయక్, ఈ. కాటయ్య, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పి. సత్యనారాయణ రెడ్డి, బట్టు మధు, జిల్లా గౌరవాధ్యక్షుడు కొనతం వెంకట్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మామిళ్ల శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దీప్లా నాయక్, రాష్ట్ర కార్యదర్శి డి. శ్రీనివాస్ సహా పలువురు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు తంగేళ్ల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, అసంపూర్తిగా ఉన్న పీఆర్టీయూ టీఎస్ నూతన కార్యాలయ భవనాన్ని పూర్తి చేసే బాధ్యతను కొత్త కార్యవర్గం తీసుకోవాలని కోరారు. అనంతరం ఎర్ర కృష్ణారెడ్డి, ఆడిదల వెంకట్ రెడ్డి, జహీర్ ఖాన్ ఎన్నికల అధికారులుగా నిర్వహించిన ఎన్నికల్లో నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం:

అధ్యక్షుడు: మూలగుండ్ల వెంకట్ రెడ్డి

ప్రధాన కార్యదర్శి: మాతంగి సైదులు

అసోసియేట్ అధ్యక్షులు: పి. రవికుమార్, బి. విజయ

ఉపాధ్యక్షులు: కే. సైదయ్య, ఎం. జ్యోతి

కార్యదర్శులు: డి. నాగయ్య, బి. సైదిరెడ్డి, జి. కవిత, ఆర్. శిరీష

నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సమావేశంలో పాల్గొన్న నాయకులు, ఉపాధ్యాయులు అభినందించి, సంఘ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

## పోలీసులకు ఉచిత లివర్ ఫైబ్రోస్కాన్ వైద్య శిబిరం





- **ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలం: జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్**

సూర్యాపేట టౌన్ / జూలై 26 / అక్షరం న్యూస్

సూర్యాపేట జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో, పట్టణంలోని డివైన్ టచ్ హాస్పిటల్ సహకారంతో పోలీసు సిబ్బందికి ఉచిత లివర్ ఫైబ్రోస్కాన్, రక్త పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజలకు వేగవంతమైన, సమర్థవంతమైన సేవలు అందించగలరని అన్నారు. విధుల్లో నిమగ్నమై తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా, మంచి ఆహారపు అలవాట్లు, క్రమం తప్పని వ్యాయామం, ఒత్తిడి లేని జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ సభ్యులతో సమయం గడపడం కూడా అవసరమని చెప్పారు. ఈ శిబిరంలో సుమారు 200 మంది పోలీసు సిబ్బందికి అత్యంత ఖరీదైన లివర్ ఫైబ్రోస్కాన్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. అనంతరం డివైన్ టచ్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ విజయ మోహన్, సంధ్య మోహన్ లివర్ ఆరోగ్యం, ఆహార నియమాలు, వ్యాధుల లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బందికి ఉచిత వైద్య సేవలు అందించిన డివైన్ టచ్ హాస్పిటల్ యాజమాన్యానికి, వైద్య బృందానికి జిల్లా ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరసింహ చారి, సీఐ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు, వైద్య బృందం, పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సంచార జాతులకు ప్రత్యేక డి.ఎన్.టి. కమిషన్ ఏర్పాటు చేయాలి..





- **జాతీయ కమిటీ సలహాదారులు మిట్టపెల్లి సాంబయ్య..**
- **వీరభద్రీయ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశంలో ప్రభుత్వాని కోరారు.**

హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూలై 26/అక్షరం న్యూస్:-

సంచార జాతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డి.ఎన్.టి. (డినోటిఫైడ్ ట్రైబ్స్) కమిషన్‌ను ఏర్పాటు చేసి, విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ వీరభద్రీయ కుల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ, జనగామ, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన నాయకులు సభ్యులు ఆదివారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ట్రస్ట్‌లో సమావేశమయ్యారు. జిల్లా అధ్యక్షుడు గుములాపురం రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జాతీయ కమిటీ సలహాదారు మిట్టపెల్లి సాంబయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డి.ఎన్.టి. పరిధిలోని సంచార జాతుల సామాజిక, విద్యా, వైద్య, ఆర్థిక అభ్యున్నతే ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. వీరభద్రీయ కులానికి చెందిన విద్యార్థులకు ప్రవేశ పరీక్ష లేకుండానే గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించాలని నిరుపేద యువతకు వృత్తి నైపుణ్య శిక్షణతో పాటు జామీను లేకుండా ప్రత్యేక బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. వీరభద్రీయ కుల సభ్యులకు డి.ఎన్.టి. ధ్రువీకరణ పత్రాలు జారీ చేసి ప్రత్యేక డి.ఎన్.టి. గ్రూప్ ఏర్పాటు చేసి రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా జాతీయ, రాష్ట్ర స్థాయిలో డి.ఎన్.టి. పరిధిలోని 51 కులాలకు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ల తరహాలో ప్రత్యేక డి.ఎన్.టి. కమిషన్ ఏర్పాటు చేయడంతో పాటు విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ రంగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంచార జాతులను ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుంటున్నారని కానీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందడం లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ వంటి ప్రజాప్రతినిధి పదవుల్లో డి.ఎన్.టి. వర్గాలకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. నిరుపేద వీరభద్రీయ కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు సంచార జాతులకు స్థిర నివాసం జీవన భద్రత కల్పించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన వీరభద్రీయ సంఘం నాయకులు, ప్రతినిధులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భారత బాణాసంచా పరిశ్రమ శతాబ్ది ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య




యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూల 26 / : భారత బాణాసంచా పరిశ్రమ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన భారత బాణాసంచా పరిశ్రమ శతాబ్ది ఉత్సవం హైదరాబాద్ నగరంలోని పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్ వద్ద ఘనంగా జరిగింది. ఈ వేడుకకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య .ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.


ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, దేశ ఆర్థికాభివృద్ధిలో భారత బాణాసంచా పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. లక్షలాది కుటుంబాలకు ఉపాధిని కల్పిస్తూ, స్వదేశీ పరిశ్రమగా వందేళ్ల ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, సాంకేతిక పరిజ్ఞానంతో కాలుష్యాన్ని తగ్గించే పర్యావరణహిత బాణాసంచా తయారీకి పరిశ్రమ మరింత కృషి చేయాలని సూచించారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా పరిశ్రమ అభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రముఖులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. దేశ నలుమూలల నుంచి వచ్చిన బాణాసంచా తయారీదారులు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని పరిశ్రమ వందేళ్ల విజయగాథను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫైర్‌వర్క్స్ డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, బాణాసంచా పరిశ్రమకు చెందిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యాపారులు మరియు భారీ సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యా శాఖ మంత్రి దేవేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువత సాధించిన ఘనవిజయం నీలం పద్మ వెంకటస్వామి



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూల 26 / : కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఈ దేశ యువ చైతన్యం సాధించిన ఘన విజయమని యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ వెంకటస్వామి అన్నారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ నీట్ పేపర్ ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా పరీక్షల నిర్వహణపై తీవ్ర వివాదం నెలకొన్న విషయము అందరికీ తెలిసిందే దేశంలో మహిళలు, యువత చేస్తున్న పోరాటాలకు ఈ విజయం స్ఫూర్తినిస్తుందని ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే అవినీతి బురదలో నిండా మునిగిపోయిన బీజేపీ కూటమి ప్రభుత్వానికి పతనం మొదలైందని ఆమె అన్నారు. విద్యావ్యవస్థతో పాటు అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించి, దేశ యువత ఆశలను, ఆశయాలను అధికార మదంతో అణచివేయాలని చూసిన మోడీ నియంతృత్వానికి రోజులు దగ్గర పడ్డాయని పద్మ విమర్శించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఈ దేశ యువత పోరాటాన్ని ఆపబోదని, రాబోయే కాలంలో అన్ని శాఖల మంత్రులు, మోడీతో సహా బిజెపి ప్రభుత్వం దిగాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి : జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / జూలై 26 / అక్షరం న్యూస్ –: జులై 27వ తేదీ, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, మరియు ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## ఇది ప్రజాస్వామ్య విజయం

- విద్యార్థుల ఒత్తిడికి తలొగ్గిన కేంద్రం.
- రాష్ట్ర మైనార్టీ నాయకులు నయీమ్ ఖురేషి.



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / జూలై 26 / అక్షరం న్యూస్ –:

నీట్ పరీక్ష పేపర్ల లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థుల ఐక్య పోరాటాల విజయమని రాష్ట్ర మైనార్టీ నాయకులు నయీమ్ ఖురేషి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద సుమారు 50 రోజులపాటు విద్యార్థులు చేపట్టిన న్యాయ పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ను గద్దె దింపారని ఇది విద్యార్థులు ఐక్య పోరాటానికి నిదర్శనమని ఢిల్లీలోని జంతర్ మంతర్ తో పాటు దేశంలోని సుమారు 100 నగరాల్లో చేపట్టిన విద్యార్థుల న్యాయ పోరాటానికి కేంద్ర అహంకారపు వైఖరి భగ్నమైనదని. ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్ళు తెరిచి విద్యార్థిల జీవితాలతో ఆడుకోకుండా నీట్ పేపర్ లీకేజ్ దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

## శంకర్ పల్లి నుండి మైతప్ ఖాన్ గూడ 'వరకు మెయిన్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి .. బి.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ధర్నా ...

- అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని రాకపోకలు కొనసాగిస్తున్న వాహనదారులు.



రంగారెడ్డి జిల్లా :శంకర్పల్లి :జులై 26: అక్షరం న్యూస్ – : శంకర్ పల్లి నుండి మైతప్ ఖాన్ గూడ వరకు రోడ్డు పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఎన్నో సార్లు అధికారులకు విన్నవించినా,పత్రిక ప్రకటన చేసిన,పట్టించుకోక పోవడం విడ్డూరంగా ఉంది. అని ఆదివారం బి. ఆర్.ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున్న స్థానిక లక్ష్మారెడ్డి గూడెం గేట్ దగ్గర నిరసన తెలిపారు, ప్రభుత్వాలు , పాలకులు మారిన గ్రామాల మెయిన్ రోడ్డుల స్థితిగతులు మారడం లేదు.అని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . మెయిన్ రోడ్డు సరిగ్గా లేకపోవడంతో వివిధ గ్రామాల ప్రజలు, వాహన దారులు, తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రాకపోకలు కొనసాగిస్తున్నారు.అత్యవసరం సమయంలో 108 అంబులెన్స్ సైతం రాలేని దుస్థితి. సరైన రోడ్డు సౌకర్యం లేక ఎన్నో ఏండ్లుగా ప్రజలు , రైతులు ,ఇబ్బంది పడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. మాజీ ఎంపీపీ ధర్మాన్న గోవర్దన్ రెడ్డి, మండల అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ...అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు అయిన ప్రధాన రహదారులను పట్టించుకోకపోవడం పై బి. ఆర్.ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆవేదన వ్యక్తం చేసారు. త్వరిత గతిన స్పందించి ప్రధాన రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని, వాహనదారులు ప్రమాదవశాత్తు ఇబ్బందులు ఎదురైతే అధికార పార్టీ ప్రభుత్వం బాధ్యత వహించాలని కోరారు. ఈ ప్రధాన రోడ్డు మార్గాన మూడు జిల్లాల అయిన వికారాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల ప్రజలు నిత్యం రాకపోకలు కొనసాగిస్తున్నారు. నిరసన కార్యక్రమంలో బి. ఆర్.ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి,మాజీ ఎంపీపీ ధర్మాన గోవర్దన్ రెడ్డి, దోభీపేట సర్పంచ్ రాఘవేందర్ రెడ్డి , మాణిక్యం రెడ్డి,మాజీ ఎంపీటీసీ భవాని యాదగిరి, రవీందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి,సీనియర్ నాయకులు కొంగర మల్లేశం, నరేందర్ రెడ్డి, బొడ వెంకటయ్య,బుచ్చిరెడ్డి, వెంకట్ రెడ్డి , శ్రీకాంత్, నారాయణ, నర్సింలు. పాల్గొన్నారు.

## వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో టీబీజికేఎస్ లో చేరిన పీవీకే 5 సూపర్ వేజెర్స్, ఓవర్ మెన్స్.




భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / జూలై 26 / అక్షరం న్యూస్ –:

కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కొత్తగూడెం ఏరియా పీవీకే 5 నుండి సూపర్ వేజెర్స్ ( ఓవర్ మెన్స్ ) టీబీజికేఎస్ లోకి వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో చేరారు. వారిని బిఆర్ఎస్ పార్టీ నాయకులు వద్దిరాజు రవిచంద్ర కండువా కప్పి ఆహ్వానించడం జరిగింది. జాయిన్ ఐనా వారు మాట్లాడుతూ కెసిఆర్ మాకు ఓవర్ మెన్స్ గా ఉద్యోగాలు ఇచ్చారని అన్నారు. కెసిఆర్ వలనే సింగరేణి కార్మికుల కు కారుణ్య నియామకాలు అనేక హక్కులు రావడం జరిగిందనీ అన్నారు. జాయిన్ ఐనా వారు గోల్కొండ నవీన్, ఎస్ కే అలీమ్, సబ్బని వినీత్, వసీమ్, అజీజ్, ఈ కార్యక్రమం లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘశీ ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ గడప రాజయ్య, సంయుక్త కార్యదర్శి వసికర్ల కిరణ్ సెంట్రల్ కమిటీ సభ్యులు బోరింగ్ శంకర్, ఈశ్వర్, వెంకటేష్, సూరజ్, అశోక్, రాములు, అన్వర్, వల్లల రాయాలింగు, కోటేశ్వరరావు, తిరుపతి పాల్గొన్నారు.




## మానవతా సేవలో 'ఎస్.జె.డబ్ల్యూ.హెచ్.ఆర్.సి' ముందుంటుంది : డా. రాజు

- నిరుపేదలకు అల్పాహారం, దుప్పట్లు పంపిణీ.




రంగారెడ్డి జిల్లా :శంకర్పల్లి :జులై 26: అక్షరం న్యూస్–:

సమాజంలో ఉన్న పేదవారిని ఆదుకోవడంలోనూ, మానవతా విలువలను కాపాడటంలోనూ సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ( ఎస్. జె. డబ్ల్యూ. హెచ్. ఆర్. సి ) ఎల్లప్పుడూ ముందుంటుందని సంస్థ జాతీయ వైస్ చైర్మన్ డా. రాజు పేర్కొన్నారు.కౌన్సిల్ జాతీయ చైర్మన్ డా. కొప్పుల విజయ్ కుమార్ గారి దిశా నిర్దేశంలో, నగరంలోని పలు ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేదలకు, బాటసారులకు సహాయ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డా. రాజు ఆధ్వర్యంలో ఉదయం అల్పాహారంతో పాటు, చలి నుండి రక్షణ పొందేందుకు ఉచితంగా దుప్పట్లు, టవళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా. రాజు మాట్లాడుతూ --- "మానవ సేవయే మాధవ సేవ అని నమ్మి మా కౌన్సిల్ పనిచేస్తోందన్నారు. సమాజంలో ఆకలితో అలమటించే వారికి, నిరాశ్రయులకు చేతనైన సాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సంస్థ చైర్మన్ డా. కొప్పుల విజయ్ కుమార్ గారి సూచనలతో ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తాం" అని తెలిపారు.

?ఈ సేవా కార్యక్రమంలో కౌన్సిల్ నగర జాయింట్ సెక్రటరీ దేశెట్టి రమాదేవి, ప్రతినిధి అనిల్ తదితరులు పాల్గొని పేదలకు సేవలు అందించారు. కౌన్సిల్ ద్వారా ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

## కార్గిల్ వీరులకు ఘన నివాళి

- యువ శౌర్య సేన ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహణ.




రంగారెడ్డి జిల్లా :శంకర్పల్లి :జులై 21: అక్షరం న్యూస్ –: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన భారత సైనికులకు యువ శౌర్య సేన ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. శంకర్‌పల్లిలోని యువ శౌర్య సేన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వీర జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం "యే షూర్ వీరోంకా మార్గ్ హై", "భారత్ మాతాకీ జై", "జై హింద్", "వందే మాతరం" నినాదాలతో కార్యాలయం మారుమోగింది. ఈ సందర్భంగా యువ శౌర్య సేన వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్ లంటు యాదవ్ మాట్లాడుతూ, 1999లో పాకిస్తాన్ సైనికులు నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) దాటి కార్గిల్ పర్వత శిఖరాలను రహస్యంగా ఆక్రమించగా, వాటిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు భారత సైన్యం 'ఆపరేషన్ విజయ్' పేరుతో సాహసోపేతమైన సైనిక చర్యలు చేపట్టిందని తెలిపారు. సముద్ర మట్టానికి 15 వేల నుంచి 18 వేల అడుగుల ఎత్తులో మంచు పర్వతాల మధ్య అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో యుద్ధం సాగిందని, ఈ యుద్ధంలో సుమారు 527 మంది భారత జవాన్లు వీరమరణం పొందారని పేర్కొన్నారు.

భారత సైన్యం, భారత వాయుసేన సంయుక్తంగా పోరాడి 1999 జూలై 26 నాటికి శత్రువులను పూర్తిగా తరిమికొట్టి భారత భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించాయని తెలిపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను ప్రతి భారతీయుడు ఎప్పటికీ మరువరాదని ఆయన అన్నారు.

అనంతరం యువ శౌర్య సేన ఉపాధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ, దేశభక్తి ఒకరోజు కార్యక్రమానికే పరిమితం కాకుండా ప్రతి పౌరుడు దేశాభివృద్ధి, జాతీయ ఐక్యత, సామాజిక బాధ్యతల పట్ల ఎల్లప్పుడూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ ఉష, సభ్యులు హర్షిని, హనుమంతరావు, నరేష్, హర్షవర్ధన్, హరి హరన్, హేమంత్ కుమార్, క్లేరిస్సాతో పాటు చిన్నారులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పాల్గొన్న వారికి స్వీట్లు పంపిణీ చేశారు.



## గుర్తుకొచ్చాయి.. ఆ చిన్ననాటి జ్ఞాపకాలు!

- పాత మిత్రులు.. కొత్త ముచ్చట్లు!
- స్మృతి వనంలో.. ఆత్మీయ కలయిక!
- ఆత్మీయ సమ్మేళనం.. జ్ఞాపకాల పరిమళం!
- బడి పాఠాలు.. నేటి జ్ఞాపకాలు!
- గురుదేవోభవ.. మిత్ర దేవోభవ!
- మళ్లీ వికసించిన బాల్య స్నేహాలు!



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి/ జూలై 26/ అక్షరం న్యూస్:

ములకలపల్లి: పాఠశాల జ్ఞాపకాలు మళ్లీ కళ్లముందు మెదిలాయి.. నాటి మిత్రుల పలకరింపులతో ఆవరణ అంతా ఆత్మీయత పరిమళించింది. మండల కేంద్రంలో 2010--11 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం కోలాహలంగా జరిగింది. మొత్తం 95 మంది విద్యార్థులకు గాను 60 మంది హాజరై సందడి చేశారు. చిన్ననాటి ముచ్చట్లు, ఉపాధ్యాయుల బోధనలు, ప్రస్తుత జీవిత విశేషాలను ఒకరికొకరు పంచుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి వేడుకలను మరింత ఘనంగా నిర్వహించాలని నిశ్చయించుకున్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ములకలపల్లి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రవి పునర్నియామకం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి/ జూలై 26/ అక్షరం న్యూస్:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజక వర్గం ములకలపల్లి మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పాలకుర్తి రవి రెండోసారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండోసారి ఈ బాధ్యతలను అప్పగించినందుకు మానుకొండూరు ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్సీ విభాగం అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణకు, అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గద్దల రమేష్‌తో పాటు ములకలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ కమిటీ నాయకులకు, కార్యకర్తలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి, ఎస్సీ వర్గాల సంక్షేమానికి శాయశక్తులా కృషి చేస్తానని ఈ సందర్భంగా రవి పేర్కొన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయసేనారెడ్డిని కలిసిన జనగామ బార్ అసోసియేషన్. న్యాయవాదులు



జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) జులై 26:తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి విజయసేనారెడ్డి హనుమకొండ,వరంగల్ కోర్టుల ప్రహంగణం లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు జరుగగా. హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు చోల్లేటి రామకృష్ణ అధ్యక్షత వహించగా.. ముఖ్య అతిథిగా పాల్గొన్నజస్టిస్ విజయసేనారెడ్డి మాట్లాడుతూ న్యాయమూర్తులు, న్యాయవాదులు సమన్వయంతో కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు తదనంతరంజనగామ జిల్లా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు తాళ్లపల్లి రాజయ్య నాయకత్వంలో సీనియర్ న్యాయవాదులు హనుమకొండలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.... ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు సహోదర రెడ్డి సీనియర్ న్యాయవాదులు పానుగంటి శ్రీనివాస్,శ్రీరామ్ శ్రీనివాస్,కోటా శంకర్, గోనె పృథ్వీరాజ్ తోపాటు న్యాయవాదులు పాల్గొన్నారు .



# ఉమ్మడి ఖమ్మం జిల్లా హ్యాండ్ బాల్ కార్యవర్గ ఎన్నిక...







- **అధ్యక్షులుగా బి. అశోక్ రెడ్డి..**
- **ప్రధాన కార్యదర్శిగా వరికూటి మోహన్**

ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ జూలై 26 (అక్షరం న్యూస్)

ఉమ్మడి ఖమ్మం జిల్లా హ్యాండ్ బాల్

కార్యవర్గాన్ని ఆదివారం ఖమ్మం సితార హోటల్ లో ఎన్నికల నిర్వహించడం జరిగినది.

ఈ ఎన్నికకు తెలంగాణ రాష్ట్ర అండ్ బాల్ అసోసియేషన్ నుండి అబ్జర్వర్ గా కే రమేష్ జిల్లా కోర్సు అథారిటీ అబ్జర్వర్ గా ఎండి గౌస్ ఒలింపిక్ అసోసియేషన్ నుండి ఉప్పల్ రెడ్డి రమేష్ చారి వారి ఆధ్వర్యంలో ఎన్నికలు ఎలక్షన్ ఆఫీసర్స్ గుడిమెట్ల బాల సైదులు నార్లపాటి అరుణ్ కుమార్, గోరింట్ల శాంతరావు నిర్వహించారు. అధ్యక్షులుగా బి. అశోక్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా వరికూటి మోహన్ కోశాధికారిగా కోపల ప్రసాద్ ఉపాధ్యక్షులుగా బందెల భాస్కర్ రావు బ్రహ్మానందరెడ్డి ఆర్ కృష్ణమూర్తి కే అనిల్ జాయింట్ సెక్రెటరీలుగా సంద్రా నితిన్ లింగాల బాలరాజు ఇనపనూరి రామాంజనేయులు జెట్టి రామకృష్ణ కార్యనిర్వాహక :- సభ్యులుగా దర్మ బిక్షం రామారావు నవీన్ కుమార్ లను ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో ఓటింగ్ జరిపి ఎన్నిక నిర్వహించారు. ఎన్నిక అనంతరం అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కోశాధికారి చైర్మన్ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్నటువంటి విద్యర్థులు యువతి యువకులను హ్యాండ్ బాల్ పై మక్కువ చుపేటువంటి వారందరినీ మండల స్థాయిలో గుర్తించి జిల్లా స్థాయి వరకు తీసుకొచ్చి జిల్లా నుండి రాష్ట్రస్థాయికి పంపి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మంచి పేరు తెచ్చే విధంగా కృషి చేస్తామనిచైర్మన్ గా మెండెం కిరణ్ కుమార్ ని ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.




## ప్రతి నెల ఒకటవ తేదీనే జీతాలు చెల్లించాలి..

- **ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎం .డి యూసఫ్**




ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ జూలై 26 (అక్షరం న్యూస్)

రాష్ట్రంలో ఎక్కడ మీటింగ్ జరిగిన ప్రతినెలా ఒకటవ తేదీనే కార్మికులకు ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి గ్రామపంచాయతీ కార్మికులకు మాత్రం ఒకటవ తేదీనే జీతాలు ఎందుకు చెల్లించడం లేదో సమాధానం చెప్పాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12వేల గ్రామపంచాయతీలో 54,000 మంది కార్మికులు పనిచేస్తున్నారని వారందరికీ ప్రతి నెల ఒకటవ తేదీన జీతాలు చెల్లించాలన్నారు. 1986 సంవత్సరం నుండి ఇంతవరకు గ్రామపంచాయతీ వర్కర్స్ ను నియమించటానికి ఒక్క పర్మినెంట్ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదంటే ఈ కార్మికులపై ప్రభుత్వాలు ఎంత వివక్షత చూపుతున్నాయో అర్థం చేసుకోవాలన్నారు. ప్రమాదంలో మరణించిన కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగ అవకాశము కల్పించాలన్నారు. సహజ మరణానికి 10 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాన్ని కార్మికులకు వెంటనే కల్పించాలన్నారు. రెండు మూడు దశాబ్దాలు పైగా పని చేసిన కార్మికులు 60 సంవత్సరాల నిండిన తర్వాత ఖాళీ చేతులతో ఇంటికి వెళ్లవలసి వస్తుందని, సత్తువ మొత్తం వెట్టి చాకిరికే పోతుందని ఆయన వాపోయారు. 60 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికులకు 10 లక్షల రూపాయల సింగిల్ టైం గ్రాడ్యుటీ కింద మంజూరు చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అర్హతను బట్టి కార్మికులకు పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నత కల్పించాలన్నారు. రాబోవు పిఆర్సి లో గ గ్రామపంచాయతీ కార్మికులను అనువర్తింపజేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, కొత్తగూడెం నగరం మేయర్ మూడు గణేష్, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. జి. క్లెమెంట్ , వెంకట రాజం జిల్లా కార్యనిర్వాక అధ్యక్షులు రావి శివరామకృష్ణ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు రాష్ట్ర సమితి సభ్యులు సిహెచ్ సీతామహాలక్ష్మి, నిమ్మటూరి రామకృష్ణ, మల్లికార్జున్, గ్రామపంచాయతీ ఉద్యోగ ఒ కార్మిక సంఘం నాయకులు వాసిరెడ్డి మురళి, పిట్టల మల్లయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, రఘునా పాలెం మండల కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల గదిలో ఏసీ ఉష్ణోగ్రత ఎంత ఉండాలో తెలుసా?

ఈ రోజుల్లో చాలా ఇళ్లలో పిల్లలు కూడా ఏసీ గదుల్లోనే నిద్రపోతున్నారు. అయితే ఏసీని సరిగ్గా వాడకపోతే, అది పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే తల్లిదండ్రులు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి.

### గది ఉష్ణోగ్రత ఎంత ఉండాలి?

పిల్లల గదిలో ఉష్ణోగ్రత $23^{\circ}C$ - $27^{\circ}C$ మధ్య ఉండటం మంచిది. చాలా తక్కువ ఉష్ణోగ్రత ఉంటే జలుబు, దగ్గు, అలర్జీ సమస్యలు రావచ్చు. గాలి నేరుగా తగలకుండా చూడండి. ఏసీ గాలి పిల్లలపై నేరుగా పడకూడదు. ఇది చర్మం, శ్వాసకు ఇబ్బందులు కలిగించవచ్చు.

### సరైన దుస్తులు అవసరం

పిల్లలకు తేలికైన, సౌకర్యవంతమైన బట్టలు వేయాలి. శరీరం పూర్తిగా కప్పేలా ఉండాలి. ఎప్పుడూ ఏసీ ఆన్‌లో ఉంచొద్దు. 3-4 గంటలకొకసారి ఏసీ ఆపడం మంచిది. కొంతసేపు గదిలో సహజ గాలి రావడం అవసరం. ఆస్తమా ఉన్నవారు, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు, చర్మ అలర్జీలు ఉన్నవారు, జ్వరం లేదా ఇన్ఫెక్షన్ ఉన్నవారు ఈ పరిస్థితుల్లో ఉన్న పిల్లలు జాగ్రత్తగా ఉండాలి.

## యాదవులకు యువశక్తే ప్రతిష్ఠాత్మక బలం..

- **చిత్తారు సింహాద్రి యాదవ్**




ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ జూలై 26 (అక్షరం న్యూస్)

హైదరాబాద్‌లోని మేడ్చల్--మల్కాజిగిరి

జిల్లా ఓల్డ్ బోయినపల్లిలోని ఐ.కే. ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో అఖిల భారత యువ యాదవ్ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి యువ యాదవ్ నాయకులు హాజరై సంస్థ బలోపేతం, యువత పాత్ర, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.ఈ సందర్భంగా లిఅఖిల భారత యువ యాదవ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు గొర్ల యశ్వంత్ యాదవ్‌ను ఖమ్మం జిల్లా అఖిల భారత యువ యాదవ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు చిత్తారు సింహాద్రి యాదవ్ శాలువాతో సన్మానించి మర్యాదపూర్వకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత యువ యాదవ మహాసభ ఉపాధ్యక్షులు వాకదని కోటేశ్వరరావు, అఖిల భారత యువ యాదవ మహాసభ జిల్లా కార్యదర్శి తుప్పతి రవికుమార్ (జర్నలిస్ట్ ఖమ్మం )అనంతరం ఆయన మాట్లాడుతూ, యాదవ సమాజ అభివృద్ధిలో యువతే ప్రధాన శక్తి అని, యువ యాదవులు సంఘటితంగా పనిచేస్తే సమాజానికి మరింత గౌరవం, గుర్తింపు లభిస్తాయని అన్నారు. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు యువతకు నాయకత్వ అవకాశాలు కల్పిస్తూ సంస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజ ఐక్యత, విద్య, ఉపాధి, సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ జిల్లాల ప్రతినిధులు, యువ యాదవ్ మహాసభ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సాలీడు కాటు ప్రమాదకరమైందా.. సాలీడు కాటు వేస్తే ఏమవుతుంది..?

సినిమాలో పీటర్ పార్కర్ ఒక స్పైడర్ కాటు వల్ల సూపర్ పవర్స్ పొందాడు. కానీ నిజ జీవితంలో మాత్రం స్పైడర్ బైట్ ప్రమాద కరంగా మారవచ్చు. Chris Keegan అనే యూకే వ్యక్తికి జరిగిన ఘటనే దీనికి ఉదాహరణ. అతని చేతిపై ఉన్న చిన్న కాటును మొదట పట్టించుకోలేదు. తర్వాత అది ఎర్రగా మారడంతో మెడిసిన్ తీసుకున్నాడు. కానీ పరిస్థితి క్రమంగా క్షీణించడం మొదలు పెట్టింది. చేయి వాపులకు గురై, ఊదా రంగులోకి మారి, బౌలింగ్ బాల్ సైజ్‌కి చేరింది. చివరకు ఆసుపత్రికి వెళ్లగా, ఇన్ఫెక్షన్ వ్యాపించకుండా ఉండేందుకు శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. సాధారణంగా సాలీడు కాట్లు హానికరం కావు. చాలా సందర్భాల్లో వాటిని అందరూ అస్సలు గమనించకపోవచ్చు. కానీ కొందరిలో చర్మం ఎర్రబారడం, నొప్పి, వాపు, చర్మంపై పుండ్లు వంటి లక్షణాలు కనిపించవచ్చు. వైద్యుల ప్రకారం నిజంగా సాలీడు కాటు వేసిందో లేదో కచ్చితంగా చెప్పడం కూడా కష్టమని సాలీడు కాటును చూసినప్పుడే దానిని నిర్ధారించవచ్చునని వారు చెబుతున్నారు.

### కొన్ని రకాల సాలీడ్లు మాత్రమే ప్రమాదకరం..

ప్రపంచంలో కొద్ది రకాల సాలీడ్లు మాత్రమే మనుషులకు ప్రమాదకరం. వాటిలో విడో స్పైడర్, రెక్లూస్ స్పైడర్ వంటి కొన్ని జాతుల సాలీడులకు మాత్రమే మనుషులను గాయపరచగలిగేంత పెద్ద కోరలు ఉంటాయి. సాధారణ స్పైడర్ కాటు వేసిన చోట చర్మం ఎర్రగా మారడం, వాపు, దురద, నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. కానీ విడో స్పైడర్ కాటు లక్షణాలు అయితే 1-3 రోజుల వరకు కనిపిస్తాయి. కాటు చుట్టూ నొప్పి, వాపు ఉంటుంది. ఇది పొట్ట, వెన్ను, ఛాతికి వ్యాపించవచ్చు. పొత్తి కడుపు బిగువుగా ఉండడం లేదా తీవ్రమైన కండరాల నొప్పులు ఉంటాయి. వాంతులు, వికారం, వణుకు, చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాగే సాలీడు కాటుకు చికిత్స ఎలా చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

### ప్రథమ చికిత్స ఇలా చేయాలి..

చాలా సందర్భాల్లో ఇంట్లోనే ఫస్ట్ ఎయిడ్‌తో చికిత్స చేయవచ్చు. సాలీడు కాటు వేసిన చోట గోరువెచ్చని నీటితో, సబ్బుతో కడగాలి. ఇన్ఫెక్షన్ బారిన పడకుండా యాంటీ బయోటిక్ క్రీమ్ రాయాలి. కాటుకు గురైన చోట ఐస్ ప్యాక్ పెట్టి వాపు తగ్గించాలి.

# బీఆర్ఎస్ జిల్లా నాయకుడు వనమా విశ్వేశ్వరరావును పరామర్శించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



ఖమ్మం జిల్లా/వైరా టౌన్ జూలై 26 (అక్షరం న్యూస్)

ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందిన అనంతరం స్వగృహానికి చేరుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకులు వనమా విశ్వేశ్వరరావును మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదివారం వైరాలోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా వనమా విశ్వేశ్వరరావుఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న పువ్వాడ అజయ్ కుమార్, వైద్యులు సూచించిన విధంగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని ప్రజా, పార్టీ కార్యక్రమాల్లో మునుపటిలాగే చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. వనమా విశ్వేశ్వరరావు కూడా తన ఆరోగ్య పరిస్థితిని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌కు వివరించి, తనను పరామర్శించేందుకు స్వయంగా నివాసానికి రావడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

ఈ పరామర్శ సందర్భంగా ఆర్ జె సి కృష్ణా, పగడాల సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయకుమార్ నాగరాజుబీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున రావు, బాణాల వెంకటేశ్వరరావు, లకావత్ గిరిబాబు, 12వ వార్డ్ కౌన్సిలర్ మాదినేని సునీత, పదో వార్డ్ కౌన్సిలర్ దోంతే బోయిన వెంకటేశ్వర్లు, సిరిపురం సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు, పేరుమల కృష్ణమూర్తి, మద్దేల రవి, ఏదునూరి శ్రీను, మిట్టపల్లి సత్యంబాబు, వజినేపల్లి చక్రవర్తి మిట్టపల్లి కిరణ్, సోమవారం వల్లే ప్రాము, వేముల శివ, ఏలూరు నరసింహారావు ముదిగొండ పుల్లయ్య వర్తక సంఘ నాయకులు వ్యాపారస్తులు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతతోనే అభివృద్ధికి బాటలు.. బీటీ రోడ్డు పనులపై క్షేత్రస్థాయి తనిఖీ

- రింగ్ రోడ్ సెంటర్‌లో కొనసాగుతున్న బీటీ రోడ్డు పనుల పరిశీలన.
- నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులకు ఆదేశం.
- ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలే లక్ష్యమన్న జూపల్లి రమేష్ బాబు.



భద్రాద్రి కొత్తగూడెం / అశ్వారావుపేట / జూలై 26 / అక్షరం న్యూస్ :–అశ్వరావుపేట మున్సిపాలిటీ పధిలోని రింగ్ రోడ్ సెంటర్‌లో చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు ఆదివారం పరిశీలించారు. పనుల పురోగతితో పాటు నిర్మాణ నాణ్యతను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడేలా నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా రోడ్డు పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దశలో ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ పనులు చేపట్టాలని, నిర్మాణంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చూడాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని జూపల్లి రమేష్ బాబు స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాసాని పద్మశేఖర్, విజయ్ కుమార్ రెడ్డి, సూరపనేని ఫణి, అల్లాడి వెంకట రామారావు, తడికమల్ల శ్రీనివాస్, 18వ వార్డు కౌన్సిలర్ తిరుమలశెట్టి వెంకన్న బాబు, అశ్వరావుపేట మున్సిపల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పసుపులేటి ఫణీంద్ర (నాని) తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం నూతన కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం..





ఖమ్మం జిల్లా/వైరా టౌన్ జూలై 26 (అక్షరం న్యూస్)

ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీ శాంతినగర్

ఎస్టి కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం నూతన కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బొర్రా రాజశేఖర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దేవాలయం కమిటీ అధ్యక్షులుగా తేజ వత్ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తేజ వత్ రాము, కార్యదర్శిగా గుగులోతు ఉపేందర్, జనరల్ సెక్రటరీ భూక్యా నరసింహ నాయక్, ట్రెజరర్ బొర్రా వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారులు ఉండ్రు శ్యాంబాబు వాంకుడోత్ భీక్యా, గుగులోత్ దుర్గా నాయక్ దర్గయ్య, కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.

ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులు దేవాలయం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదిన వేడుక సందర్భంగా కేక్ కట్ చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బొర్రా రాజశేఖర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ ఉండ్రు శ్యాంబాబు పట్టణ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు మండల కాంగ్రెస్ నాయకులు వాంకుడోత్ భీక్య శీలం చంద్రశేఖర్ రెడ్డి వీరయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# తక్కువ నీటితో అధిక దిగుబడును ఇచ్చే పంట రకాలను ఎంచుకోవాలి..





- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య

ఖమ్మం జిల్లా/వైరా టౌన్ జూలై 26 (అక్షరం న్యూస్)

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి దనసరి పుల్లయ్య , ఏడిఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, మండల వ్యవసాయ శాఖ అధికారి మయన్ మంజుఖన్ వైరా మండలంలోని వివిధలక్ష్యం పురం, పాలడుగు, గరికపాడు గ్రామాల్లో సందర్శించి రైతులకు పంటలపై ఎల్ నినో ప్రభావంపై అవగాహన కల్పించారు .

ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య మాట్లాడుతూ రైతులు ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా వానాకాలం సీజన్లో స్వల్పకాలిక తక్కువ నీటితో అధిక దిగుబడును ఇచ్చే పంట రకాలను ఎంచుకోవాలని సూచించారు.

ఏడిఏ తుమ్మలపల్లి కరుణశ్రీ మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ పంటలైన పెసలు, మినుములు, కందులు, జొన్నలు మరియు ఇతర చిరుధాన్యాల పంటలు పండించాలని సూచించారు. ఈ సంవత్సరం భూగర్భ జలాలు అడుగంటి పోవడం జరుగుతుంది కాబట్టి ముందస్తు ప్రణాళికలో భాగంగా వరి మరియు మిర్చికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పంటలను వేయాలని సూచించడం జరిగింది. మండల వ్యవసాయ శాఖ అధికారి మయన్ మంజుఖన్ మాట్లాడుతూ..

మండలంలో జూలైలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అవుతున్న నేపథ్యంలో భూగర్భ జలమట్టం తగ్గుతుందని భూగర్భ జలాలు పెంచేలా రైతులు ఫార్మ్పండ్స్ (పంట కుంటలు) ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం విబిజీ రామ్ జి పథకం ద్వారా 100% రాయితీపై అందిస్తుందని, ఈ ఫార్మ్ పాండ్స్(పంట కుంటలు) పథకాన్ని రైతులందరూ అధిక మొత్తంలో వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్యం పురం గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరరావు, గరికపాడు సర్పంచ్ లక్కిరెడ్డి నాగలక్ష్మి, పాలడుగు సర్పంచ్ గద్దెల నరసింహారావు, ఏఈఓ లు వెంపటి కీర్తి, పరిటాల వెంకట నరసయ్య, మేడా రాజేష్, దొడ్డ పుల్లయ్య, మల్లు రామకృష



# చర్మం యవ్వనంగా ఉండాలని వీటిని తీసుకుంటున్నారా.. అయితే జాగ్రత్త..

ఇటీవలి కాలంలో కొల్లాజెన్ సప్లిమెంట్లు చాలా ప్రాచుర్యం పొందాయని చెప్పవచ్చు. మెరిసే చర్మం, బలమైన జుట్టు, గోర్లు, కీళ్ల ఆరోగ్యం కోసం వీటిని చాలా మంది ఉపయోగిస్తున్నారు. కానీ కొల్లాజెన్ పౌడర్లు, డ్రింక్స్ లేదా క్యాప్సూల్స్ వాడే ముందు వాటి ప్రయోజనాలు, ప్రమాదాల గురించి తెలుసుకోవడం కూడా చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. కొల్లాజెన్ అనే ప్రోటీన్ ను శరీరం సహజంగా ఉత్పత్తి చేస్తుంది. ఇది చర్మం, ఎముకలు, టెండన్స్, కార్టిలేజ్ నిర్మాణాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అయితే కొల్లాజెన్ సప్లిమెంట్లు తీసుకునే ముందు కొన్ని ప్రమాదాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. మెరైన్ కొల్లాజెన్ (చేపల నుండి పొందేది) తరచుగా చేపల వాసన లేదా రుచి కలిగి ఉంటుంది. ఇది చాలా మందికి ఇష్టం లేకపోవచ్చు. అలాగే కొందరికి అలర్జీ రియాక్షన్లు కూడా కలగవచ్చు.

## జీర్ణ సమస్యలు, చర్మ సమస్యలు వచ్చే అవకాశం..

వయస్సు పెరిగే కొద్దీ సహజ కొల్లాజెన్ ఉత్పత్తి తగ్గుతుంది. దీనివల్ల ముడతలు, కీళ్ల నొప్పి, చర్మం వదులుగా అవ్వడం జరుగుతుంది. అందుకే చాలా మంది కొల్లాజెన్ సప్లిమెంట్లను ఉపయోగిస్తూ ఉంటారు. కానీ ఇవి పూర్తిగా సురక్షితమైనవి కావని నిపుణులు చెబుతున్నారు. కొల్లాజెన్ సప్లిమెంట్లను ఉపయోగించడం ద్వారా కొన్ని సమస్యలు కూడా కలుగుతాయని వారు చెబుతున్నారు. కొల్లాజెన్ సప్లిమెంట్లు తీసుకున్న తర్వాత కొందరికి కడుపు ఉబ్బరం, కడుపు నిండుగా అనిపించడం, హార్ట్‌బర్న్, వాంతులు వంటి సమస్యలు రావచ్చు. ఇవి సాధారణంగా తేలికపాటి సమస్యలే అయినప్పటికీ అసౌకర్యంగా ఉంటాయి. ఎక్కువ మోతాదులో తీసుకుంటే ఈ సమస్యలు మరింత ఎక్కువగా కనిపించవచ్చు. కొల్లాజెన్ ఉత్పత్తులు కొందరిలో అలర్జీలను కూడా కలిగిస్తాయి. కొల్లాజెన్ సప్లిమెంట్లు సాధారణంగా జంతు ఉత్పత్తుల నుంచి తయారు అవుతాయి. ముఖ్యంగా చేపలు లేదా షెల్‌ఫిష్ నుంచి తీసే మెరైన్ కొల్లాజెన్ వలన సీఫుడ్ అలర్జీ ఉన్నవారికి ప్రమాదం ఉంటుందని చెప్పవచ్చు. వీటిని ఉపయోగించడం వల్ల దురద, చర్మంపై దద్దుర్లు, గొంతులో అసౌకర్యం వంటి లక్షణాలు కనిపించవచ్చు.

## ప్రోటీన్ మోతాదు పెరిగే ప్రమాదం..

అలాగే తయారీ విధానం, ముడి పదార్థాన్ని బట్టి కొల్లాజెన్ సప్లిమెంట్లలో కొద్దిగా భారీ లోహాలు ఉండే అవకాశం ఉంది. మంచి బ్రాండ్లు భద్రతా ప్రమాణాలు పాటించినప్పటికీ, నాసిరకం ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరం కావచ్చు. అదే విధంగా కొల్లాజెన్ సప్లిమెంట్లు తీసుకోవడం వల్ల రోజువారీ ప్రోటీన్ మోతాదు పెరుగుతుంది. ఇది అందరికీ మంచిది కాదని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా కిడ్నీ సమస్యలు ఉన్నవారికి లేదా ఇప్పటికే ఎక్కువ ప్రోటీన్ తీసుకుంటున్నవారికి ఇది ఒత్తిడిని కలిగించవచ్చు. ఇక చర్మం మెరుగుపడటం లేదా కీళ్ల ఆరోగ్యం కోసం కొల్లాజెన్ ఉపయోగపడుతుందని చెప్పినా, దీనికి సంబంధించిన శాస్త్రీయ ఆధారాలు మిశ్రమంగా ఉన్నాయి. కొంతమంది వ్యక్తులకు మాత్రమే స్వల్ప ప్రయోజనం కనిపించవచ్చు. ఇది వృద్ధాప్యానికి పూర్తిస్థాయి పరిష్కారం కాదని వైద్యులు సూచిస్తున్నారు. కొల్లాజెన్ సప్లిమెంట్స్ ను వాడడం వల్ల ఇటువంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. కేవలం సప్లిమెంట్స్ పైనే ఆధారపడకుండా సహజంగా కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచే మార్గాలను కూడా వారు తెలియజేస్తున్నారు.

## ఈ ఆహారాలను తీసుకోవాలి..

విటమిన్ సి ఎక్కువగా ఉన్న నిమ్మకాయలు, బెర్రీలు, బెల్ పెప్పర్లు వంటి ఆహారాలను తీసుకోవాలి. గుడ్లు, చేపలు, పప్పులు వంటి ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. వీటితో పాటు ఎక్కువగా సూర్యకిరణాలు చర్మంపై పడకుండా చర్మాన్ని రక్షించుకోవాలి. పొగ తాగడం మానేయాలి. సరైన నిద్ర, వ్యాయామం ద్వారా సహజంగానే కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుకోవచ్చు. కొల్లాజెన్ సప్లిమెంట్లు కొంతవరకు ప్రయోజనం ఇవ్వవచ్చు కానీ అవి అందరికీ అవసరం పడవని వీటిని వాడడం వల్ల జీర్ణ సమస్యలు, అలర్జీలు వంటి సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.